


## విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాట ఆరోగ్య పాఠశాల


# ప్రభాత సమాచారం

https: epaper.
prabhathasamacharam.com

ఆదిలాబాద్ Digital Edition

మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్

■ బుధవారం | 7 జనవరి 2026 | ■ 12 పేజీలు



10

# భద్రత వట్టిదేనా సాగు ప్రశ్నార్థకం..!

■ ప్రభాత సమాచారం, ఆదిలాబాద్ ప్రతినిధి

■ గండ్లు పూడ్చరు.. కడగండ్లు తీర్చరు ■ ఏటేటా తగ్గిపోతున్న వట్టివాగు ఆయకట్టు ■ ఈ యాసంగిలో వరిపై ఆశలు వదులుకోవాల్సిందేనా..!

■ నీరున్నా ఉపయోగం సున్నా... సాగు నీటికి బ్రేక్ ■ ఎండుతున్న పంటలు ■ ఆరుతడి పంటలను మాత్రమే సూచిస్తున్న అధికారులు

వట్టివాగు ప్రాజెక్టు భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారుతున్నది. యేటేటా ఓపెన్‌కాస్టు మట్టితో ప్రాజెక్టును నింపుతుండగా, ముున్ముందు ఆయకట్టు సాగు కష్టమేనన్న ప్రశ్న తలెత్తుతున్నది. ఇక ప్రస్తుతం కాలువలకు మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో సాగు నీరందించలేమని, రైతులు ఆరుతడి పంటలు మాత్రమే వేసుకోవాలని యంత్రంగాం సూచిస్తున్నది. జిల్లాలోని కుమ్రం భీం ప్రాజెక్టు తర్వాత చెప్పుకోదగ్గది వట్టివాగు ప్రాజెక్టు. దాదాపు 27 వేల ఎకరాలకు సాగునీరందించే లక్ష్యంతో దీనిని నిర్మించారు. 2.06 టీఎంసీల నీటి సామర్థ్యంతో దీనిని నిర్మించారు. 2001లో ఈ ప్రాజెక్టును పూర్తి చేసినప్పటి నుంచి ఏ యేడాది కూడా పూర్తిస్థాయిలో సాగు నీరందించలేకపోయింది. ప్రాజెక్టులో నీటి నిల్వలు ఉన్నప్పటికీ వాటిని పంటలకు వినియోగించలేని దుస్థితి నెలకొంది. ప్రాజెక్టులో ప్రస్తుతం 2.00 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నపటికీ కనీసం యాసంగి పంటలకు కూడా నీరు అందించలేని పరిస్థితి ఉంది. పాలకుల నిర్లక్ష్యం, అధికారుల అలసత్వం కలిసి ప్రాజెక్టులోని నీరు రైతులకు ఏమాత్రం ఉపయోగపడడం లేదు. కాలువలకు మరమ్మతులు చేయకపోవడం.. పూడికతో నిండిపోవడం.. ఎక్కడికక్కడ ధ్వంసం కావడంతో శిథిలావస్థకు చేరుకున్నాయి. 27 వేల ఎకరాలకు నీరందించే లక్ష్యంతో నిర్మించిన ఈ ప్రాజెక్టు ప్రస్తుతం 1500 ఎకరాలకు మాత్రమే సాగు నీరందిస్తున్నది. ఈ ఏడాది కాలువల మరమ్మతులకు నిధులు మంజూర్యాయని చెబుతున్న అధికారులు, వేసవిలో కాలువల మరమ్మతులు చేయనున్న కారణంగా నీరివ్వడం సాధ్యం కాదని, కనుక రైతులు ఆరుతడి పంటలను మాత్రమే వేసుకోవాలని సూచిస్తున్నారు. దీంతో ప్రాజెక్టు కింద సాగవుతున్న ఆ మాత్రం సాగు కూడా ప్రశ్నార్థకంగా మారింది.


12

## నాగోబా జాతరకు పకడ్బందీ ఏర్పాట్లు

■ మంత్రులకు మేస్రం వంశీయుల ఆహ్వానం ■ 18న ప్రారంభం కానున్న జాతర

■ డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు సీతక్క, జూపల్లికి ఆహ్వాన పత్రిక అందజేసిన ఎమ్మెల్యే

ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్ నాగోబా జాతర ఈనెల 18న ప్రారంభం కానుంది. జాతరకు లక్షలాది మంది భక్తులు హాజరుకానున్నారు. మంగళవారం ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు కేస్లాపూర్ నాగోబా దేవాలయం కమిటీ సభ్యులు, ఆలయ పీఠాధిపతి వెంకటరావుతో కలిసి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రులు సీతక్క జూపల్లి కృష్ణారావుతో పాటు సీఎం సలహాదారుడు వేం.నరేందర్ రెడ్డిలను కలిశారు. ఈనెల 18న నాగోబా ఆలయంలో మహా పూజ 22న దర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. నాగోబా జాతరకు హాజరు కావాలని ఆహ్వాన పత్రికను అందజేశారు.

## చీకట్లోనే వైద్యం

కౌటాల ఆసుపత్రిలో చీకట్లోనే చికిత్సలు చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. మండలంలోని తుమ్మిడిహెట్టి గ్రామానికి చెందిన లవకుష్ మంగళవారం తన చేనులో సాయంత్రం క్రషర్ పడుతున్న సమయంలో పాము కాటుకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు స్పందించి లవకుష్‌ను మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకు వచ్చారు. డాక్టర్ పవన్‌కల్యాణ్ ఇంజక్ష న్ ఇచ్చి చికిత్సలు నిర్వహించారు.




2

## బీఆర్ఎస్ రైతు పోరుబాట

■ ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేయాలి డిమాండ్ ■ పట్టణంలో భారీ ర్యాలీ

■ న్యాయం జరిగే వరకు పోరాడుతాం ■ మాజీ మంత్రి జోగురామన్న ■ అరెస్టు చేసినపోలీసులు

అన్నదాత పండించిన పంటల కొనుగోళ్లలో నిబంధనలను తొలగించాలని, పండిన ప్రతి గింజను ప్రభుత్వం మద్దతు ధరతో కొనుగోలు చేసి రైతుల ఇక్కట్లు దూరం చేయాలని మాజీ మంత్రి జోగు రామన్న డిమాండ్ చేశారు. రైతుల సమస్యలపై బీఆర్ఎస్ ఆధ్వర్యంలో చేపడుతున్న పోరుబా టలో భాగంగా మంగళవారం ఆదిలాబాద్ పట్టణ బంద్‌కు పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో వేకువజామునే మాజీ మంత్రి జోగు రామన్న సారథ్యంలో బీఆర్ఎస్ శ్రేణులు ఆర్టీసీ బస్ డిపో ఎదుట బైఠాయించారు.పెద్ద ఎత్తున నిరసన నినాదాలు చేస్తూ బస్సులు బయటకు రాకుండా అడ్డుకున్నారు. దీంతో డిపోలోనే బస్సులు ఉండిపోయాయి.



# బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతు పోరుబాట

- అన్నదాతలకు అండగా బీఆర్ఎస్ పోరు
- రైతుల సమస్యలపై దశలవారీ ఆందోళనలు..
- ప్రతి గింజను ప్రభుత్వమే కొనుగోలు చేయాలి
- ఆదిలాబాద్ పట్టణంలో భారీ ర్యాలీ
- మాజీ మంత్రి జోగు రామన్న అరెస్టు

**ఆదిలాబాద్, జనవరి 6 (ప్రభాత సమాచారం)** అన్నదాత పండించిన పంటల కొనుగోళ్లలో నిబంధనలను తొలగించాలని, పండిన ప్రతి గింజను ప్రభుత్వం మద్దతు ధరతో కొనుగోలు చేసి రైతుల ఇక్కట్లు దూరం చేయాలని మాజీ మంత్రి జోగు రామన్న డిమాండ్ చేశారు. రైతుల సమస్యలపై బీఆర్ఎస్ ఆధ్వర్యంలో చేపడుతున్న పోరుబాటలో భాగంగా మంగళవారం ఆదిలాబాద్ పట్టణ బంద్‌కు పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో వేకువజామునే మాజీ మంత్రి జోగు రామన్న సారథ్యంలో బీఆర్ఎస్ శ్రేణులు ఆర్టీసీ బస్ డిపో ఎదుట బైఠాయించారు. పెద్ద ఎత్తున నిరసన నినాదాలు చేస్తూ బస్సులు బయటకు రాకుండా అడ్డుకున్నారు. దీంతో డిపోలోనే బస్సులు ఉండిపోయాయి. డీఎస్పీ జీవన్ రెడ్డితో పాటు పోలీసులు అక్కడికి చేరుకుని ఆందోళనకారులను సముదాయించే ప్రయత్నం చేయగా.. మాజీ మంత్రి నిరసనను విరమించేందుకు ఒప్పుకోకపోవడంతో ఆయనను బలవంతంగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు. మాజీ మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ తో పాటు పలువురు నేతలను వాహనాల్లో స్టేషన్‌కు తరలించారు. అనంతరం పట్టణ ప్రధాన వీధుల గుండా బీఆర్ఎస్ నేతలు బైక్ ర్యాలీలు చేపట్టి దుకాణాలను బంద్ చేయించారు. బంద్‌కు ఛాంబర్ ఆఫ్ కామర్స్ అసోసియేషన్ తో పాటు వ్యాపార సంస్థలు మద్దతు తెలపడంతో దుకాణాదారులు స్వచ్ఛందంగా మూసివేశారు. పట్టణంలోని వినాయక్ చౌక్,అశోక్ రోడ్,గాంధీ చౌక్,అంబేద్కర్ చౌక్,పంజాబ్ చౌక్ మీదుగా బీఆర్ఎస్ యువ నాయకుడు జోగు మహేందర్ నేతృత్వంలో బైక్ ర్యాలీలు చేపట్టి నేతలు నిరసన వ్యక్తం చేశారు. రైతాంగం పట్ల కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న వైఖరికి నిరసనగా పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ ర్యాలిలో పాల్గొన్నారు. బంద్ నేపథ్యంలో పోలీసులు పటిష్ట బందోబస్తు చర్యలు చేపట్టారు. ఈ మేరకు మాజీ మంత్రి జోగు రామన్న మాట్లాడుతూ.. ప్రభుత్వ రంగ సంస్థలైన నాఫెడ్, మార్క్ ఫెడ్ కొనుగోళ్లు చేయక రైతులు పడరాని పాట్లు పడుతుంటే ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వాలు కనీసం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. రంగు మారిన సోయా పంటను వెంటనే కొనుగోలు చేయాలని, లేని పక్షంలో మరిన్ని ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కేంద్రంపై ఒత్తిడి తీసుకువచ్చి నిబంధనల సడలింపు చేయాల్సిన స్థానిక ఎంపీ, ఎమ్మెల్యేల నుంచి కనీస స్పందన లేకపోవడం దురదృష్టకరమని అన్నారు. రైతుకు న్యాయం జరిగేంత వరకు పోరాటం ఆగదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు యాసం నర్సింగరావు, అజయ్, విజ్జగిరి నారాయణ,మెట్టు ప్రహల్లాద్, గంద్రత్ రమేష్, యూనిస్ అక్బానీ, సాజితోద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర స్థాయి పోటీల్లో విజేతగా నిలవాలి



## ఐటీడీఏ ఇంచార్జ్ పీఓ యువరాజ్ మర్మట్

**ఉట్నూర్, జనవరి 6 (ప్రభాత సమాచారం)** రాష్ట్ర స్థాయిలో జరిగే గిరిజన క్రీడోత్సవాల్లో ఉట్నూర్ ఐటీడీఏ పరిధిలోని క్రీడాకారులు విజేతలై తిరిగి రావాలని ఐటీడీఏ ఇంచార్జ్ పీఓ యువరాజ్ మర్మట్ అన్నారు. ఏటూరు నగరంలో జరిగే రాష్ట్ర స్థాయి క్రీడల్లో పాల్గొనేందుకు వెళుతున్న క్రీడాకారులు సందర్భంగా ఐటీడీఏ ఇంచార్జ్ పీఓ యువరాజ్ మర్మట్ విద్యార్థులకు క్రీడా సామాగ్రిని అందించి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ.. ఇటీవల కాలంలో గిరిజన క్రీడా పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయిలో పతకాలు సాధించడం అభినందనీయమన్నారు. వారిని స్ఫూర్తిగా తీసుకొని మిగతా క్రీడాకారులు రాష్ట్ర స్థాయిలో జరిగే గిరిజన క్రీడోత్సవాల్లో రాణించాలని సూచించారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని గుర్తు చేశారు. రాష్ట్ర స్థాయి పోటీల సందర్భంగా విద్యార్థులకు పలు సూచనలు



చేశారు. కార్యక్రమంలో ఐటీడీఏ డీడీ అంబాజీ, జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి, హెచ్ఎం, పీడీ లు, ఆత్రం భాస్కర్, చందన్, ఆర్. ప్రకాష్, కృష్ణారావు, ప్రేమ్ దాస్, ఉత్తం, గంగారాం, మధుసుదన్, జైవంత రావు పాల్గొన్నారు.



# రెండు ఆలయాల్లో చోరీ

**మామడ, జనవరి 6 (ప్రభాత సమాచారం)** మండలంలోని పొన్కల్ గ్రామంలో ఉన్న హనుమాన్ ఆలయం, శివాలయాల్లో సోమవారం రాత్రి చోరీ జరిగింది. మంగళవారం ఉదయం పూజలు నిర్వహించేందుకు పూజారి రమాకాంత్ ఆలయానికి వచ్చి లోపలికి వెళ్లి పరిశీలించగా, హనుమాన్ ఆలయంలో హుండీ పగలగొట్టబడినట్లు గమనించారు. అనంతరం పక్కనే ఉన్న శివాలయానికి వెళ్లి చూడగా, అక్కడ ఏర్పాటు చేసిన యాంప్లిఫైయర్ దొంగిలించబడినట్లు గుర్తించారు. ఈ విషయాన్ని ఆలయ కమిటీ సభ్యులకు సమాచారం ఇచ్చారు. శివాలయంలోని హుండీని కూడా పగలగొట్టేందుకు దుండగులు ప్రయత్నించినప్పటికీ అది తెరుచుకోకపోవడంతో దాని పక్కనే ఉన్న సుమారు రూ.30 వేల విలువ చేసే యాంప్లిఫైయర్‌ను గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లినట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

# రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు

**నిర్మల్, జనవరి 6 (ప్రభాత సమాచారం)** రవాణా శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ రోడ్డు భద్రత మహోత్సవాల్లో భాగంగా మంగళవారం నిర్మల్ పట్టణంలో అవగాహన సదస్సులు నిర్వహించారు. పట్టణంలోని ప్రధాన క్రీడలలో ప్రభుత్వ పాఠశాలలో కళాశాలలో రోడ్డు ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై డ్రైవర్లకు విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రవాణా శాఖ అధికారులు ఆసిఫ్ నితిన్ తేజారావ్ సిబ్బంది పాల్గొన్నారు.



# వాహనదారులు హెల్మెట్ ధరించాలి

**బెజ్జూర్, జనవరి 6 (ప్రభాత సమాచారం)** బెజ్జూర్ మండల కేంద్రంలోని పోలీస్ ఆధ్వర్యంలో మంగళవారం హెల్మెట్ ధరించి బైక్ ర్యాలీ నిర్వహించారు. రోడ్డు భద్రత వారోత్సవాల సందర్భంగా కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ నికిత పంత్ కాగజ్నగర్ డీఎస్పీ వహీదుద్దీన్ ఆదేశాల మేరకు బెజ్జూర్ లో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కౌటాల సీఐ బి.సంతోష్ కుమార్ మాట్లాడారు. వేగం కన్నా ప్రాణం మిన్న అన్నారు. ప్రాణాలు కాపాడుకునేందుకు ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. రోడ్డు భద్రతలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్‌తో పాటు, బండి కాగితాలు, ఇన్సూరెన్స్ తప్పనిసరిగా చేసుకోవాలన్నారు. హెల్మెట్ అనేది తలకు అస్త్రం లాంటిది అన్నారు. కార్యక్రమంలో బెజ్జూరు తహశీల్దార్ రామ్మోహన్ రావు, ఎంపీడీవో బీఎస్ ప్రవీణ్ కుమార్, ఎస్సై సర్దాజ్ పాషా గ్రామ పంచాయతీ సెక్రటరీ వైకుంఠం, నాయకులు అమీరుద్దీన్, తిరుపతి, శంకర్, మల్లేష్ పాల్గొన్నారు.

## అధికారుల పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేసిన

# జిల్లా పంచాయతీ అధికారి

**చెన్నూర్, జనవరి 6 (ప్రభాత సమాచారం)** మంచిర్యాల జిల్లా చెన్నూరు మండలంలోని పలు గ్రామపంచాయతీల పనితీరును మంచిర్యాల జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మండలంలోని సుద్దాల గ్రామంలో పర్యటించగా గ్రామంలో డైలీ శానిటేషన్‌లో భాగంగా డ్రై వెస్ట్ చేయకపోవడం, ప్లాస్టిక్ సేకరణ చేపట్టకపోవడం, నర్సరీ నందు నిర్వహణ బాగా లేకపోవడం వంటి అంశాలపై పంచాయతీ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పంచాయతీ కార్యదర్శి 4 రోజుల సమయంలో ఎలాంటి విధి నిర్వహణ లోపం లేకుండా, పూర్తి స్థాయిలో పనులను నిర్వహించాలని ఆదేశించారు. అనంతరం అంగరాజ్ పల్లి గ్రామ పంచాయతీ నందు రికార్డుల పరిశీలన, ఇంటి పన్ను వసూలు, నర్సరీ నిర్వహణ పైన పంచాయతీ కార్యదర్శికి తగిన సూచనలు అందజేశారు. అంగరాజ్ పల్లి గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న



ప్రాథమికోన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి విద్యార్థులకు అందిస్తున్న భోజనంలో పౌష్టికాహారం అందించకుండా, నియమ నిబంధనలు పాటించకుండా వ్యవహరిస్తున్న తీరుపై పాఠశాల హెడ్‌మాస్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, మండల విద్యాధికారికి ఆదేశాలు జారీ చేశారు. మండలంలోని వివిధ గ్రామ పంచాయతీలలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అధికారుల తీరుపై ఆయన మండిపడ్డారు. వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రాణం తీసిన చేపల వేట

**ముథోల్, జనవరి 6 (ప్రభాత సమాచారం)**

వారికి వలే జీవనాధారం. అదే వల ప్రమాదవశాత్తు చుట్టుకొని ఒక వ్యక్తి ప్రాణాలు కోల్పోయిన సంఘటన లోకేశ్వరం మండలంలో జరిగింది. ఎస్సై అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ధర్మోరా గ్రామానికి చెందిన మాడబోయి చిన్న సాయన్న(50) అనే మత్స్యకారుడు మంగళవారం ఉదయం ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్‌లోకి చేపల వేటకు వెళ్లగా ప్రమాదవశాత్తు వల చుట్టుకోవడంతో మరణించాడు. ఈ మేరకు కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.





# నిర్మల్ ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు చేయాలి

### నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

**నిర్మల్, జనవరి 6 (ప్రభాత సమాచారం)**
నిర్మల్ ఉత్సవాల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లను తక్షణమే ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో నిర్మల్ ఉత్సవాల నిర్వహణపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ నెల 19 నుంచి 23 వరకు నిర్మల్ ఉత్సవాలను నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. గత సంవత్సరం నిర్మల్ ఉత్సవాలను విజయ వంతంగా నిర్వహించి రాష్ట్ర వ్యాప్తంగా మంచి గుర్తింపు పొందామని గుర్తు చేశారు. నిర్మల్ జిల్లా చరిత్ర, సాంస్కృతిక వారసత్వాన్ని ఉత్సవాల వేదిక ద్వారా ప్రజలకు పరిచయం చేయగలిగామని అన్నారు. ఈ సంవత్సరం మరింత ఉత్సాహంతో, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి నిర్మల్ ఉత్సవాలను విజయవంతం చేయాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమాల నిర్వహణకు ఎన్టీఆర్ మినీ స్టేడియాన్ని సిద్ధం చేయాలని, సుందరీకరణ పనులు చేపట్టి మరుగుదొడ్లు, లైటింగ్ సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. అలాగే వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక స్థలాన్ని కేటాయించాలని తెలిపారు. జిల్లాలోని పాఠశాలల విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని, నిర్మల్ ఉత్సవాల విజయవంతానికి విస్తృత ప్రచారం కల్పించాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో డీఈఓ భోజన్న, డీవైఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి, ఆర్అండ్‌బీ ఈఈ నర్సయ్య, డీపీఆర్వో విష్ణువర్ధన్, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, ఈడీఎం నదీమ్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## రంగు మారిన సోయాను కొనుగోలు చేయాలి

### అసెంబ్లీ సమావేశంలో ఎమ్మెల్యే పాయల్ శంకర్

**ఆదిలాబాద్, జనవరి 6 (ప్రభాత సమాచారం)**
రంగు మారిన సోయాబీన్ పంటను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ కోరారు. ఈ విషయాన్ని ఆయన మంగళ వారం అసెంబ్లీ సమావేశంలో ప్రస్తావించారు. సోయాబీన్ ముఖ్య పంటగా రైతులకు ఆదాయ వనరుగా ఉందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ ఏడాది వాతావరణ పరిస్థితుల కారణంగా సోయాబీన్ పంటలో రంగు మారిందని పేర్కొన్నారు. ప్రస్తుతం అమలులో ఉన్న నిబంధనల ప్రకారం.. రంగు మారిన సోయాబీన్ కొనుగోలుకు అర్హత లేకపోవడం వల్ల రైతులు తీవ్ర నష్టాన్ని ఎదుర్కొంటున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం ముందుకొచ్చి, రంగు మారిన సోయాబీన్ కొనుగోలు లో వచ్చే నష్టాన్ని 50 శాతం వరకు భరించేందుకు సిద్ధంగా ఉందన్న సభ దృష్టికి తీసుకువచ్చారు. రైతుల ప్రయోజనాల దృష్ట్యా మిగిలిన నష్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం భరించి, రంగు మారిన సోయాబీన్‌ను కొనుగోలు చేయాలన్నారు.

## పొలం పనులకని వెళ్లిన వ్యక్తి ఆత్మహత్య

**నార్నూర్, జనవరి 6 (ప్రభాత సమాచారం)**
మతిస్థిమితం కోల్పోయిన వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటుచేసుకుంది. ఎస్సై అఖిల్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చోర్‌గావ్ గ్రామానికి చెందిన బట్వాడే నందు(56) సోమవారం రాత్రి పొలం పనుల కోసం అని వెళ్లి పొలంలో ఉరి వేసుకున్నట్లు తెలిపారు. మృతుడికి భార్య నలుగురు పిల్లలు ఉన్నారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# చైనా మాంజా విక్రయిస్తే చర్యలు తప్పవు

**రామకృష్ణాపూర్, జనవరి 6 (ప్రభాత సమాచారం)**
రామకృష్ణాపూర్ పట్టణంలోని బీ-జోన్ సెంటర్ మరియు రాజీవ్ చౌక్‌లో గల దుకాణ యజమానులతో మాట్లాడిన ఎస్సై చైనా మాంజా దారంను ప్రభుత్వం నిషేధించిందని తెలిపారు. గతంలో గాలిపటాలు ఎగరేసే సమయంలో చైనా మాంజావాడటం వలన చాలామంది ప్రజలు, వాహనదారులు గాయాలపాలయ్యారని కొంతమంది ప్రాణాలు సైతం పోగొట్టుకున్నారని గుర్తుచేశారు. ఈ క్రమంలో రాబోవు సంక్రాంతి పండుగ సందర్భంగా రామకృష్ణాపూర్ పట్టణంలోని దుకాణ యజమానులు ఎట్టి పరిస్థితుల్లో కూడా చైనా మాంజా విక్రయించవద్దని హెచ్చరించారు. పట్టణంలోని యువకులు, పిల్లలు గాలిపటాలు ఎగరేసే సమయంలో



ఎవరు కూడా చైనా మాంజా వాడకూడదని, పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై భూమేష్ పాటు కానిస్టేబుల్ జంగు, ఓంకార్ పలు దుకాణ యజమానులు, యువకులు పాల్గొన్నారు.

# కోడిపందాలు ఆడితే కేసులు నమోదు చేస్తాం: సీఐ

**కన్నెపల్లి, జనవరి 6 (ప్రభాత సమాచారం)**
మండలంలో ఎవరైనా సంక్రాంతి పండుగ నేపథ్యంలో గ్రామాల్లో కోడి పందాలు నిర్వహిస్తే వారిపై కేసులు నమోదు చేస్తామని తాండూరు సీఐ దేవయ్య అన్నారు. మంగళవారం కన్నెపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని పాత కోడిపందాలు ఆడిన వారిని కేసులు నమోదు అయిన వారిని కన్నెపల్లి ఎస్ఐ భాస్కర్ రావు ఆధ్వర్యంలో పిలిపించి వారికి కౌన్సిలింగ్ నిర్వహించారు. గతంలో కోడిపందాలు నిర్వహించిన 12 మందిని తహశీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. అనంతరం వారితో మాట్లాడుతూ.. మీ గ్రామాల్లో నిషేధిత క్రీడలైన కోడిపందాలు, పేకాట, జూదం ఇతర అసాంఘిక కార్యక్రమాలు నిర్వహించరాదని, చెడు వ్యసనాలకు బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దని అన్నారు. ప్రజలు ప్రశాంత వాతావరణంలో పండుగలు కుటుంబ సభ్యుల సమక్షంలో జరుపుకోవాలని సూచించారు. గ్రామాల్లో ఎవరైనా అసాంఘిక కార్యక్రమాలు చేపడితే పోలీసులకు సమాచారం అందించాలని సీఐ తెలిపారు.



## లాటరీల పేరుతో మోసం చేసే వారిపట్ల చర్యలు తప్పవు

**ఆదిలాబాద్, జనవరి 6 (ప్రభాత సమాచారం)**
లాటరీల పేరుతో మోసం చేసే వారిపట్ల చర్యలు తప్పవని ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్ రెడ్డి మంగళవారం తెలియజేశారు. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలని లాటరీ పేరుతో అమాయకులను మోసం చేస్తున్న తుమ్మ మహిపాల్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. ఇతని వద్ద నుంచి 13 లాటరీ బుక్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.





## వైద్య సిబ్బందిపై చర్యలు తీసుకోవాలి

**వాంకిడి, జనవరి 6 (ప్రభాత సమాచారం)**
వైద్యం కోసం వాంకిడి సర్కార్ దవాఖానకు వెళ్తే.. అక్కడి వైద్య సిబ్బంది రోగిని కనీసం పట్టించుకోవడం లేదని వారిపై చర్యలు తీసుకోవాలని తుండు దెబ్బ నాయకులు డిమాండ్ చేశారు. సోనపూర్ గ్రామానికి చెందిన విజయ్ అనే యువకుడికి తీవ్ర గాయాలతో రక్తస్రావంతో బాధపడుతుండగా సోమవారం రాత్రి వాంకిడి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొచ్చాం.. స్పందించి రోగికి వైద్యం అందించాల్సిన సిబ్బంది లోనికి ఎవరు రాకుండా ప్రధాన ద్వారానికి లోపలి నుంచి తలుపులు వేసి పడుకుని ఉన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాసేపు తర్వాత వచ్చి సిబ్బంది.. కనీసం రోగిని పరీక్షంచకుండా తమ పట్ల దురుసుగా ప్రవర్తించారని, ఆపై రోగిని ఆసిఫాబాద్ తీస్కెళ్లాలని సూచించారని మండిపడ్డారు. సిబ్బంది తీరును నిరసిస్తూ రాత్రి ఆస్పత్రి ఎదుట తుండు దెబ్బ నాయకులు నిరసన తెలిపారు. అత్యవసర సమయంలో ఆస్పత్రికి వైద్యానికి వచ్చే పేదలకు కనీసం ప్రాథమిక చికిత్స అందించని డాక్టర్లు, ఆస్పత్రి ఎందుకు అని ప్రశ్నించారు. జిల్లా వైద్యాధికారులు స్పందించి విధుల పట్ల నిర్లక్ష్యంగా ఉన్న సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మోహన్‌రావు పాటిల్ ప్రజా ట్రస్ట్ ఆధ్వర్యంలో

## టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత

**ముథోల్, జనవరి 6 (ప్రభాత సమాచారం)**
మండల కేంద్రంలోని ముథోల్‌లో ప్రభుత్వ, కేజీబీవీ, మైనార్టీ పాఠశాలలోతో పాటు, ప్రైవేట్ పాఠశాలలు రబింద్రహై స్కూల్, శిశుమందిర్ స్కూల్‌లో పదవ తరగతి విద్యార్థులకు మోహన్‌రావు పాటిల్ ప్రజా ట్రస్ట్ ఆధ్వర్యంలో స్టడీమెటీరియల్‌ను చైర్మన్ మోహన్ రావు పాటిల్ అందజేశారు. పేద, మధ్య తరగతి విద్యారుతులకు తనవంతు చేయూతగా ఇవ్వడం అందజేయడం జరిగిందని ఆయన తెలిపారు. విద్యార్థులు కష్ట పడి ఉన్నత స్థానానికి చేరుకోవాన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సుభాష్ పటేల్, ధర్మపురి సుదర్శన్, సోమేశ్ తదితరులు పాల్గొన్నారు.



# సేంద్రియ వ్యవసాయంతో రైతులకు లాభాలు

**వేమనపల్లి, జనవరి 6 (ప్రభాత సమాచారం)**
సేంద్రియ వ్యవసాయంతో రైతులకు అధిక లాభాలు వస్తాయని మండల వ్యవసాయ అధికారి వీరన్న, డిస్ట్రిక్ట్ మాస్టర్ ట్రైనర్ సతీష్ అన్నారు. మండలంలోని దస్నాపూర్ గ్రామ పంచాయతీలోని కొత్తపల్లిలో నేషనల్ మిషన్ ఆ నేచురల్ ఫార్మింగ్‌పై రైతులకు ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో మాట్లాడుతూ.. సేంద్రియ వ్యవసాయం గోమాత ఆధారంగా చేయడంతో భూమి సారం పెరిగి రసాయనిక ఎరువుల వాడకుండా ఖర్చులు తగ్గించుకోవడంతో అధిక లాభాలను పొందవచ్చని అన్నారు. బయట రసాయన ఎరువులు ధరలు విపరీతంగా పెరుగుతుండడం ద్వారా రైతుల ఆదాయాన్ని నష్టపోతున్నారని సేంద్రియ వ్యవసాయంలో జీవామృతం గోవుల పేడ, గోవుల మూత్రం ఘనజీవామృతం, వంటి వనరుల భూమి యొక్క సారాన్ని పెంచి వ్యవసాయం చేసి అధిక పంట దిగుబడి పొందవచ్చని ఇప్పటికైనా గ్రామాల్లోని రైతులు రసాయనిక ఎరువుల మార్గం తగ్గించి సేంద్రియ వ్యవసాయం చేయాలని రైతులకు సూచించారు. దస్నాపూర్ సర్పంచ్ మడే శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.





## కామన్‌పల్లి మహేంద్ర
# సంఘం కమిటీ ఎన్నిక

**జన్నారం, జనవరి 6 (ప్రభాత సమాచారం)**
జన్నారం మండలం కామన్‌పల్లి దేవుని గూడా గ్రామాలకు చెందిన మేదర సంఘం కార్యవర్గాన్ని మంగళవారం రెండు గ్రామాల సభ్యుల సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా ఒడిపల్లి సురేష్, ప్రధాన కార్యదర్శిగా నీలి నర్సింగం, కోశాధి కారిగా కోడి జుట్టు రాజన్న, ప్రచార కార్యదర్శిగా మదిరే రవీందర్ లను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. ఎన్నికైన నూతన కమిటీని సభ్యులు శాలువాలు, పూలమాలతో ఘనంగా సత్కరించారు ఈ సందర్భం గా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ తమపై నమ్మకాన్ని ఉంచి ఏకగ్రీవంగా ఎన్నుకున్న మహేంద్ర బంధువులకు కృతజ్ఞతలు తెలుపుతూ  రెండు గ్రామా ల్లోని  సమస్యల పరిష్కారం కోసం  తమవంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మహేంద్ర సంఘ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మహేంద్ర సంఘం సభ్యులకు సన్మానం



**జన్నారం, జనవరి 6 (ప్రభాత సమాచారం)**
జన్నారం మండలం నుండి ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలలో మహేంద్ర సంఘం తరపున పోటీ చేసిన వారందరికి మహేంద్ర సంఘ రాష్ట్ర నాయకులు కోరుట్లలో జరిగిన సన్మాన కార్యక్రమంలో ఘనంగా సన్మానించారు ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు మాట్లాడుతూ మహేంద్ర సంఘం తరఫున చాలామంది పోటీలో నిలబడ్డారు వారి ధైర్యానికి అభినందనలు తెలియజేశారు. గెలుపొందిన వారిని ఘనంగా సన్మానించారు. త్వరలో జరగబోయే ఎంపీటీసీ, జెడ్పిటిసి మున్సిపల్ ఎన్నికలలో పోటీ చేయాలని పోటీలో ఉన్న వారందరికీ రాష్ట్ర నాయక త్వం అండగా నిలబడుతుందని అన్నారు కార్యక్రమం లో రాష్ట్ర నాయకులు జిల్లా నాయకులతో పాటు పెద్ద ఎత్తున మహేంద్ర సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

**బెల్లంపల్లి, జనవరి 6 (ప్రభాత సమాచారం)**
బెల్లంపల్లి పట్టణంలోని రైల్వే స్టేషన్ ఏరియాలో గంజాయి అక్రమ రవాణా విక్రయిస్తున్న వ్యక్తిని టూ టౌన్ పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై కిరణ్ కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మంగళవారం బెల్లంపల్లి రైల్వే స్టేషన్ ఏరియాలో వాహనాలు తనిఖీ చేపట్టినట్లు తెలిపారు. ఈ క్రమంలో ఓ వ్యక్తి అక్కడ అనుమానాస్పదంగా తిరగడంతో అతన్ని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వివరాలు సేకరించగా అతని వద్ద 36 గ్రాముల డ్రై గంజాయి ప్యాకెట్, మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితుడు బెల్లంపల్లి మండలం మాల గురజాల చెందిన రామ కృష్ణగా గుర్తించారు. మహారాష్ట్ర లోని బల్లార్షా లో గంజాయి తక్కువ ధరకు కొనుగోలు చేసి విక్రయిస్తు న్నట్లు విచారణలో వెల్లడైందన్నారు. కేసు నమోదు చేసినట్లు తెలిపారు.



# ఓటరు జాబితాపై అభ్యంతరాలను నిర్ణీత గడువులోగా సమర్పించాలి



**నిర్మల్, జనవరి 6 (ప్రభాత సమాచారం)**
మున్సిపాలిటీ ఎన్నికలకు సంబంధించి రూపొందించిన ముసాయిదా ఓటరు జాబితాపై ఉన్న అభ్యంతరాలను నిర్ణీత గడువులోగా సమర్పించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ సూచించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరం లో నిర్మల్, భైంసా, ఖానాపూర్ మున్సిపాలిటీలకు సంబంధిం చి రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ వేరు వేరుగా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటరు జాబితా తయారీ, అభ్యంతరాల స్వీకరణ, తుది జాబితా ప్రచురణ ప్రక్రియపై వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికల ప్రక్రియను పూర్తిస్థాయిలో పారదర్శ కంగా, లోపాలు లేకుండా నిర్వహిస్తామని స్పష్టం చేశారు. మున్సిపాలిటీల వారీగా ఇప్పటివరకు ముసాయిదా ఓటరు జాబితాపై వచ్చిన అభ్యంతరాలను సమీక్షించి, వాటిని నిబంధ నల ప్రకారం పరిష్కరిస్తామని తెలిపారు. ఓటరు జాబితాలో పేర్లు, చిరునామాలు తదితర వివరాల్లో ఏవైనా తప్పులు ఉంటే ఈ నెల 9వ తేదీ వరకు సంబంధిత మున్సిపల్ కమిష నర్లకు లేదా జిల్లా అధికారులకు ఫిర్యాదులు అందజేయాలని రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు. అందిన ఫిర్యా దులను వార్డు అధికారులు, బీఎల్‌ఓలు, ఇతర అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్దేశిం చిన షెడ్యూల్ ప్రకారం ఈ నెల 10వ తేదీన మున్సిపాలిటీల పోలింగ్ స్టేషన్‌ల వారీగా తుది ఓటరు జాబితాను ప్రచురిం చనున్నట్లు వెల్లడించారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు, సమగ్ర ఓటరు జాబితా రూపొందించేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు పూర్తి సహకారం అందించాల ని కోరారు. ఈ సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు ఓటరు జాబితా, మ్యాపింగ్, వలస ఓటర్లు, చిరునామాలు తదితర అంశాలపై తమ అభ్యంతరాలు, సందేహాలను వ్యక్తం చేయగా అధికారులు వాటిని నివృత్తి చేశారు. ఫిర్యాదులకు సంబంధించి పూరించాల్సిన వివిధ ఎన్నికల ఫారములపై వివరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఆర్డీఓ రత్న కళ్యాణి, మున్సిపల్ కమిషనర్లు జగదీశ్వర్ గౌడ్, సుందర్ సింగ్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# సాగు ఉత్పత్తి నిర్వహణపై రైతులు అవగాహన కలిగి ఉండాలి




**మంచిర్యాల, జనవరి 6 (ప్రభాత సమాచారం)**
వ్యవసాయ రంగంలో పంట సాగు ఉత్పత్తి నిర్వహణపై రైతులు అవగాహన కలిగి ఉండాలని జిల్లా సహకార అధికారి సత్యనారాయణ అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో రైతు ఉత్పత్తిదారుల సంఘాల కార్యకలాపాలపై ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి వరంగల్ సిటిసి. ప్రిన్సిపల్ యాకూబ్ నాయక్, ప్రధాన శిక్షణదారు భూసరపు శ్రీనివాస్ లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా సహకార అధికారి మాట్లాడుతూ శిక్షణ కార్యక్రమంలో నేర్చుకున్న అంశాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ శిక్షణలో లర్నింగ్ మేనేజ్మెంట్ సిస్టం, ఎలక్ట్రానిక్ నేషనల్ అగ్రికల్చర్ మార్కెట్, ఓపెన్ నెట్వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్, మార్కెట్ లింకేజ్, డిజిటల్ లిటరసీ, డ్రోన్-వ్యాపార కార్యకలాపాలపై శిక్షణ అందించడం జరిగిందని తెలిపారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని పంట సాగులో అధిక ఉత్పత్తి సాధించేందుకు కృషి చేయాలని తెలిపారు.

# అమ్మకు అక్షరమాల ద్వారా వయోజన విద్యాభివృద్ధి



**మంచిర్యాల, జనవరి 6 (ప్రభాత సమాచారం)**
ప్రభుత్వం చేపట్టిన అమ్మకు అక్షరమాల కార్యక్రమం ద్వారా వయోజన విద్య అభివృద్ధికి చర్యలు తీసుకోవడం జరుగుతుం దని డిప్యూటీ ట్రైనీ కలెక్టర్ మహమ్మద్ విలాయత్ అలీ అన్నారు. జిల్లాలోని దండేపల్లి మండలం గుడిరేవు గ్రామంలో గల ఉల్లాస్ అక్షరాస్యత కేంద్రాలను జిల్లా వయోజన విద్యాధి కారి పురుషోత్తం నాయక్, మండల ప్రత్యేక అధికారి చాతరా జుల దుర్గాప్రసాద్, జిల్లా సంక్షమ శాఖ అధికారి రౌఫ్ ఖాన్ లతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా డిప్యూటీ ట్రైనీ కలెక్టర్ మాట్లాడుతూ అక్షరాలు దిద్ది చదువు నేర్చుకోవడానికి వయసుతో సంబంధం లేదని, 15 నుండి 60 సంవత్సరాల లోపు వారందరూ చదువుకోవాలని, అప్పుడే సమాజంలో గౌరవ స్థానం లభిస్తుందని అన్నారు. జిల్లా వయోజన విద్యాధికారి మాట్లాడుతూ ఉల్లాస్ అక్షరాస్యత కేంద్రాలకు నిరక్షరాస్యులు ప్రతి ఒక్కరు రావడమే కాకుండా చదువు నేర్చుకుని 100 రోజుల్లో అక్షరాస్యులుగా తయారు కావాలని తెలిపారు. ఈ కార్యక్రమం విజయవంతం చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు జిల్లా అధికార యంత్రాంగం కృషి చేస్తుందని తెలిపారు. అనంతరం ఉల్లాస్ అక్షరాస్యత కేంద్రంలో చదువు నేర్చుకుంటున్న మహిళలు తమ అభిప్రాయాలను అధికారులకు తెలియజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో సమన్వయకర్త, ప్రధానోపాధ్యాయుడు బుచ్చన్న, జిల్లా విద్య క్వాలిటీ ఎడ్యుకేషన్ అధికారి సత్యనారాయణ మూర్తి, ఎం ఆర్ పి జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.



## అటవీ ప్రాంతాల్లో రహదారి పనుల అనుమతులపై
# ప్రత్యేక దృష్టి సారించి త్వరితగతిన పరిష్కరించాలి
### ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా

**ఆదిలాబాద్, జనవరి 6 (ప్రభాత సమాచారం)**
జిల్లాలో అటవీ ప్రాంతాల మీదుగా ప్రతిపాదించిన రహదారి నిర్మాణ పనులకు సంబంధించి అటవీ శాఖ అనుమతులు, పెండింగ్‌లో ఉన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లో జిల్లా అటవీ శాఖ అధికారి ప్రశాంత్ బాజీరావు పాటిల్‌తో కలిసి సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ (డీపీఆర్‌ఈ) పరిధిలోని 11 కీలక రహదారి పనులపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అటవీ సంరక్షణ చట్టాల నిబంధనలను కచ్చితంగా పాటిస్తూ అభివృద్ధి పనులు కొనసాగించాలని సూచించారు. తిరస్కరణకు గురైనవి, పెండింగ్‌లో ఉన్న రహదారి పనుల దరఖాస్తులపై ఇంజనీరింగ్ అధికారులు వెంటనే క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టి, అటవీ శాఖ అధికారుల సమన్వయంతో పూర్తి స్థాయి నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించే లక్ష్యంతో అనుమతుల ప్రక్రియను వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో శిక్షణ కలెక్టర్ సలోని చబ్రా, అటవీ డివిజనల్ అధికారి విశ్వనాథ్ బుసా రెడ్డి, అటవీ క్షేత్ర గులాబ్ సింగ్, పుండలీక్, సంతోష్, అటవీ, ఇంజనీ రింగ్ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.





# విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాట ఆరోగ్య పాఠశాల

## ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా

**ఆదిలాబాద్, జనవరి 6 (ప్రభాత సమాచారం)**
విద్యార్థుల శారీరక, మానసిక వికాసమే ప్రధాన లక్ష్యంగా జిల్లాలో 'ఆరోగ్య పాఠశాల' కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆరోగ్య పాఠశాల, రోడ్డు భద్రత కార్యక్రమాలపై సంబంధిత అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ సంక్షమ గురుకుల విద్యాలయాల సంస్థలలో ప్రవేశ పరీక్షలకు సంబంధించిన పోస్టర్లు, ఫ్లెక్సీలను కలెక్టర్ ఆవిష్కరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు ఆరోగ్యం, పరిశుభ్రత, సామాజిక బాధ్యతలపై అవగాహన కల్పించడమే 'ఆరోగ్య పాఠశాల' కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. కేవలం విద్యకే పరిమితం కాకుండా, విద్యార్థులు సంపూర్ణ ఆరోగ్యంతో, మంచి అలవాట్లతో ఎదిగేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. ఆరోగ్య పాఠశాల కార్యక్రమంలో భాగంగా వ్యక్తిగత పరిశుభ్రత, పోషకాహారం, మానసిక ఆరోగ్యం, మాదకద్రవ్యాల నివారణ, వ్యాధుల నివారణ, వ్యక్తిత్వ వికాసం వంటి అంశాలపై వారపు కార్యచరణ రూపొందించి, రోజుకో అంశంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీని ద్వారా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందుతుందని పేర్కొన్నారు. అలాగే రోడ్డు భద్రత నియమాలపై విద్యార్థులు తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని, ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా రోడ్డు భద్రత నియమాలు పాటించాలని అన్నారు. విద్యార్థి దశ నుంచే రోడ్డు భద్రతపై అవగాహన కలిగి ఉండడం ద్వారా ప్రమాద రహిత జిల్లాగా ఆదిలాబాద్‌ను తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అంతకుముందు పలువురు విద్యార్థులు ఆరోగ్య పాఠశాల, రోడ్డు భద్రత అంశాలపై ఉపన్యాసాలు, నాటికలు ప్రదర్శించి ఆకట్టుకున్నారు. అనంతరం స్టూడెంట్ ఛాంపియన్లకు కలెక్టర్ ప్రశంస పత్రాలు, టీషర్టులు అందజేశారు. అలాగే ఇటీవల కరీంనగర్‌లో జరిగిన రాష్ట్రస్థాయి 'చెకుముకి సైన్స్ సంబరాలు' కార్యక్రమంలో ప్రతిభ చూపిన జడ్పిహెచ్ఎస్ పిప్పర్ వాడ విద్యార్థులకు కలెక్టర్ ప్రశంస పత్రాలు అందజేసి అభినందించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, శిక్షణ కలెక్టర్ సలోని చబ్రా, జిల్లా రవాణా శాఖ అధికారి శ్రీనివాస్, ఆరోగ్య పాఠశాల కోఆర్డినేటర్లు అజయ్, తిరుపతి, ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు, రవాణా, విద్యా శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.







# సమస్యల పరిష్కారానికి ఉపాధ్యాయుల ఉద్యమ బాట

**జన్నారం, జనవరి 6 (ప్రభాత సమాచారం)**
రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సభ్యులు జాడి రాజన్న. ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికై ఉద్యమిస్తామని యుఎస్‌పిసి రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సభ్యులు జాడి రాజన్న అన్నారు మంగళవారం హైదరాబాదులో జరిగిన స్టీరింగ్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉద్యోగులకు రావలసిన నాలుగు డి.ఏలను వెంటనే విడుదల చేయాలని, పెండింగ్‌లో ఉన్న జి.పి.ఎఫ్, సరెండర్ లీవ్ మొదలైన బిల్లులను వెంటనే చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పదవి విరమణ చేసిన ఉద్యోగుల ఉపాధ్యాయుల కు రావలసిన బిల్లులను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. పిఆర్‌సి గడుగు పూర్తయి రెండు సంవత్సరాలు గడిచిన ప్రభుత్వం పి ఆర్.సిపై ప్రకటన చేయకపోవడం బాధాకరమని అన్నారు .వెంటనే మెరుగైన ఫిట్మెంట్ తో పిఆర్సి ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు తమతో కలిసివచ్చే సంఘాలతో జనవరి నెలాఖరిలో ఉద్యమ కార్యచరణ తేదీలను ప్రకటిస్తామని అన్నారు.






## ఓటర్ల జాబితా రూపకల్పనలో
# పారదర్శకత పాటించాలి
### ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా

**ఆదిలాబాద్, జనవరి 6 (ప్రభాత సమాచారం)**
రాబోయే మున్సిపల్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మున్సిపల్ ఎన్నికలు, ఓటర్ల జాబితా సవరణ, అభ్యంతరాల పరిష్కారంపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో ఓటర్ల జాబితా కీలక పాత్ర పోషిస్తుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడంతో పాటు, డూప్లికేట్ ఓట్లు, మరణించిన వారి పేర్లను నిబంధనల ప్రకారం తొలగించాలని అధికారులకు సూచించారు. ఓటర్ల జాబితాలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఓటర్ల జాబితాపై రాజకీయ పార్టీల ప్రతినిధులు, ప్రజల నుంచి వచ్చే అభ్యంతరాలను క్షుణ్ణంగా పరిశీలించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. జాబితా సవరణలో రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని కోరారు. సమావేశంలో లేవనెత్తిన పలు సందేహాలకు కలెక్టర్ సమాధానాలు ఇస్తూ, వారి సూచనలను పరిగణనలోకి తీసుకుంటామని అన్నారు. వార్డుల వారీగా పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, ఓటర్ల జాబితా ప్రదర్శన తదితర అంశాలపై మున్సిపల్ అధికారులకు, సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, శిక్షణ కలెక్టర్ సలోని చబ్రా, మున్సిపల్ కమిషనర్ రాజు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## పాఠశాల ప్రాంగణం శుభ్రం చేయించిన వార్డు మెంబర్

**బెజ్జూర్, జనవరి 6 (ప్రభాత సమాచారం)**
బెజ్జూర్ మండలంలోని ఏటి గూడ గ్రామంలో 10వ వార్డ్ నెంబర్ సడిమెక రాకేష్ పాఠశాల ప్రాంగణాన్ని శుభ్రం చేయించారు. గ్రామ పంచాయతీ సర్పంచ్, కార్యదర్శికి చెప్పినప్పటికీ పట్టించుకోకపోవడంతో సొంత డబ్బులతో పాఠశాల ప్రాంగణాన్ని ట్రాక్టర్ బ్లేడ్ బండితో శుభ్రం చేయించినట్లు తెలిపారు.



## ముధోల్‌లో అండర్-23
# క్రికెట్ జోనల్ పోటీలు ప్రారంభం

**ముథోల్, జనవరి 6 (ప్రభాత సమాచారం)**
నియోజకవర్గ కేంద్రమైన ముధోల్‌లో తెలంగాణ క్రిట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జోనల్ అండర్ 23 క్రీడా పోటీలు మంగళవారం ప్రారంభం అయ్యాయి. స్థానిక ఉన్నత పాఠశాల మైదానంలో క్రిట్ పోటీలను తెలంగాణ క్రిట్ అసోసియేషన్ తరుపున నిజామాబాద్ మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మనారాయణ, ఎస్ఐ బిట్ల పెర్సిస్, స్థానిక సర్పంచ్ షబానా ఎజాజోద్దిన్ , తెలంగాణ క్రిట్ అసోసియేషన్ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు బాజీరావు లు ప్రారంబించారు. ఈసందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతు క్రీడా పోటీలు మానసిక ఉల్లాసం ను కలిగిస్తాయన్నారు. క్రీడా పోటీల వల్ల పోటీతత్వం పెరుగుతుందన్నారు. క్రీడాకారులు తమ ప్రతిభను ప్రదర్శించడానికి ఇలాంటి పోటీలు ఉపయోగపడతాయని అన్నారు. ఈ సందర్భంగా మొదటి మ్యాచ్ అదిలాబాద్, మంచిర్యాల టీంలు పోటీపడ్డాయి. ఈ కార్యక్రమంలో క్రిటర్ నయీముద్దీన్, కార్యదర్శి దత్తు, బిజెపి మండల అధ్యక్షులు కోరిపోతన్న, ఉపసర్పంచ్ లావణ్య సాయినాథ్,మాజీ ఎంపీటీసీ మగ్దుమ్, టిసిఏ అభయ్ పటేల్, ముధోల్ నియోజకవర్గం మున్నూరుకాపు సంఘం అధ్యక్షులు రోల్ల రమేశ్, నాయకులు మదన్ మోరే, సాయి, ధర్మపురి శ్రీనివాస్, దశరత్, జిందంవార్ వెంకటేష్, ఇమ్రాన్ ఖాన్, తదితరులు, పాల్గొన్నారు.



# రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన

**ఆదిలాబాద్, జనవరి 6 (ప్రభాత సమాచారం)**
జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవంలో భాగంగా పట్టణంలోని ప్రభుత్వ బాలికల పాఠశాల (భూక్తపూర్), ప్రభుత్వ పాఠశాల (బొక్కలగూడ)లో రోడ్డు భద్రతా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రోడ్డు భద్రత నియమాలు, ట్రాఫిక్ సంకేతాలు, సురక్షత ప్రయాణ విధానాలు, ద్విచక్ర వాహనాల వినియోగంలో హెల్మెట్ ప్రాముఖ్యత, వాహనాలను అతివేగంగా నడపడం వల్ల కలిగే ప్రమాదాలు వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. రోడ్డు భద్రతా నియమాలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలన్నారు. చిన్న వయస్సులోనే ట్రాఫిక్ నియమాలపై అవగాహన కలిగితే ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ రవాణా శాఖ నుండి హరింద్ర కుమార్, నిహారిక, రమేష్ రెడ్డి, సుధాకర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.





లక్షెట్టిపేట, జనవరి 6 (ప్రభాత సమాచారం)
రహదారి భద్రత మాసోత్సవాలలో భాగంగా రహదారి భద్రతా నిబంధనలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని జిల్లా రవాణా అధికారి గోపీనాథ్ తెలిపారు. మంగళవారం ఉత్సవాలలో భాగంగా లక్షెట్టిపేట మండల కేంద్రంలోని ట్రినిటీ ఉన్నత పాఠశాలలో ఎం వి ఐ లు సిహెచ్. రంజిత్ కుమార్, ఏ. కిషోర్ చంద్రారెడ్డి ల ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా రవాణా అధికారి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రహదారి భద్రతా నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కార్లు నడిపేవారు సీట్ బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని, మద్యం

# ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలి



సేవించి, మొబైల్ మాట్లాడుతూ వాహనాలు నడపకూడదని, రహదారులపై నియంత్రిత వేగంతో మాత్రమే వాహనాలను నడపాలని తెలిపారు. 18 సంవత్సరాల వయసు నిండి అర్హత కలిగిన వారు లైసెన్స్ పొందాలని, వాహనాలకు సంబంధించిన అన్ని ధృవపత్రాలను కలిగి ఉండాలని తెలిపారు. విద్యార్థిని విద్యార్థులు రోడ్డుపై నడిచేటప్పుడు, బస్సులలో, ఆటోలలో ప్రయాణించేటప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలపై వివరించారు. రహదారి భద్రత మాస ఉత్సవాలలో భాగంగా పాఠశాల విద్యార్థులకు చిత్రలేఖనం, ఉపన్యాస పోటీలు నిర్వహించి ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. పాఠశాల బస్సుల ధ్రువపత్రాలు, స్థితిగతులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ డోన్ డామినిక్, ప్రిన్సిపాల్ జోసెఫ్, సంబంధిత అధికారులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# సీపీఐ జిల్లా మహాసభలను విజయవంతం చేయండి



దండేపల్లి, జనవరి 6 (ప్రభాత సమాచారం)
మంచిర్యాల జిల్లాలో సీపీఐ ప్రచార జాత 4వ రోజు జన్నారంలో ప్రారంభమై దండేపల్లి మండల కేంద్రనికి చేరుకుంది. బస్టాండ్ వద్ద జరిగిన కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ మాట్లాడుతూ ఈ నెల 10న రామకృష్ణాపూర్‌లో బహిరంగ సభను చేయాలని కోరారు. బహిరంగ సభలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, మాజీ ఎమ్మెల్యే చాడా వెంకట రెడ్డి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కలవేన శంకర్, వాసిరెడ్డి సీతారామయ్య హాజరై ప్రసంగిస్తారన్నారు. అలాగే జనవరి 18 ఖమ్మంలో జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరారు. 1925 డిసెంబర్ 26న కాన్పూర్‌లో ఆవిర్భవించి నాడే దున్నేవాడికి భూమి దక్కాలని, భారత స్వాతంత్రం కోసం నిజాం నవాబులను గద్దదించడానికి, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం నిర్వహించిన చరిత్ర సీపీఐది అన్నారు. సుమారు 4,500 మంది కమ్యూనిస్టులు ప్రాణ త్యాగాలు చేసి పది లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచి, 3,000 గ్రామాలను విముక్తి చేసిన ఘనమైన చరిత్ర ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు జోగుల మల్లయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు లింగం రవి, జిల్లా సమితి సభ్యులు, కామెర దుర్గారాజ్, రవీందర్, సీపీఐ నాయకులు, విజయ్, నర్సింగరావు, పోషం పాల్గొన్నారు.



## రాష్ట్రస్థాయిలో మోడల్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

మంచిర్యాల, జనవరి 6 (ప్రభాత సమాచారం)
తెలంగాణ మాథ్స్ ఫోరమ్ ఆధ్వర్యంలో సిద్దిపేట జిల్లా గజ్వేల్ మోడల్ స్కూల్‌లో మంగళవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి గణిత ప్రతిభా పరీక్షల్లో మంచిర్యాల విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు ప్రిన్సిపాల్ ముత్యం బుచ్చన్న తెలిపారు. రాష్ట్రస్థాయి పరీక్షలో మోడల్ స్కూల్ విద్యార్థులు శ్రీ సాయి హర్ష మొదటి బహుమతి, సాహిత్య రెండవ బహుమతి సాధించారన్నారు.

## ట్రాక్టర్ ఢీకొని 28 గొర్రెలు మృతి

లక్షెట్టిపేట, జనవరి 6 (ప్రభాత సమాచారం)
మండలంలోని సూరారం గ్రామ స్టేజ్ వద్ద జాతీయ రహదారిపై ట్రాక్టర్ ఢీకొని సుమారు 28 గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్సై గోపతి సురేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. నారాయణపేట అశోక్ నగర్ కు చెందిన కర్రెపోలా గజలప్ప తన గ్రామం వద్ద తనకున్న గొర్రెలకు మేత దొరకకపోవడంతో ఆయనకున్న గొర్రెలను పట్టుకొని తిప్పుతూ మేపుతూ ఉంటారన్నారు. ఈ క్రమంలో తనకున్న గొర్రెలను నిన్నటి వరకు దండేపల్లి మండలం లో మేపి వాటిని ఈరోజు మంచిర్యాల వైపు తీస్తుళ్తుండగా లక్షట్టిపేట వైపు నుంచి మంచిర్యాల వైపు సిమెంట్ ఇటుకల లోడుతో వస్తున్న ట్రాక్టర్ డ్రైవర్ తన ట్రాక్టర్ను అతివేగంగా అజాగ్రత్తగా నడుపుతూ గొర్రెల మంద పైకి రావడంతో 28 మేకలు అక్కడికక్కడే మృతి చెందాయన్నారు. గొర్రెల యజమాని గజలప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.



# పాటలు పాడి.. ప్రజలను చైతన్యం చేసి..



జన్నారం, జనవరి 6 (ప్రభాత సమాచారం)
సీపీఐ పార్టీ 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఖమ్మం జిల్లాలో ఈ నెల 18వ తేదీన నిర్వహించే భారీ బహిరంగ సభకు ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరుతూ మంచిర్యాల జిల్లా జన్నారం మండల కేంద్రంలో ప్రధాన రోడ్డుపై సీపీఐ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక బస్ స్టాండ్ ఎదుట పాటలు పాడి ప్రజలను చైతన్యం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కలవేని శంకర్, జిల్లా కార్యవర్గ సభ్యుడు కలెందర్ అలీఖాన్ మాట్లాడుతూ.. ప్రజల సమస్యల పరిష్కారం కోసం సీపీఐ పార్టీ పోరాటం చేస్తుందన్నారు. చలో ఖమ్మం సభను సీపీఐ కార్యకర్తలు, విజయవంతం చేయాలని కోరారు.

## గ్రామంలో గుడుంబాను నిషేధించాలి

జైనూర్, జనవరి 6 (ప్రభాత సమాచారం)
జైనుర్ మండలం జంగమ గ్రామ పంచాయతీలో గుడుంబా మద్యం నిషేధించాలి అని మంగళవారం రాంజీగూడా యువజన సంఘం ఆధ్వర్యంలో సర్పంచ్‌కు వినతి పత్రం అందజేశారు. యువజన సంఘం సభ్యులు మాట్లాడుతూ లంబాడి తండాలో తయారీ అవుతున్న గుడుంబా మద్యం వల్ల యువత గుడుంబా మద్యం వల్ల ఎన్నో కుటుంబాలు వీధిపాలు ఆవతున్నాయి.గుడుంబా మద్యం వల్ల చాలా మంది యువత చెడిపోతున్నారు అని వాపోయారు. లంబాడి తండాలో తయారీ అవుతున్న గుడుంబా మద్యం పూర్తిగా నిషేధించాలని కోరారు.



# రహదారి నిబంధనలు తప్పకుండా పాటించాలి

దండేపల్లి, జనవరి 6 (ప్రభాత సమాచారం)
ప్రజలు రోడ్డు నిబంధనలు పాటిస్తేనే ప్రమాదాలను నివారించవచ్చని జిల్లా సహాయ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సూర్య తేజ పేర్కొన్నారు. మంగళవారం మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలంలోని వెలగనూర్, దండేపల్లి ఉన్నత పాఠశాలలో రోడ్డు భద్రత మాసోత్సవాలు పురస్కరించుకొని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించడమే కాకుండా, రోడ్డు నియమ నిబంధనలు తెలుసుకోవాలన్నారు. 18 ఏళ్లు నిండని పిల్లలు వాహనాలు నడిపితే తల్లిదండ్రులకు జైలు శిక్ష నడిపిన వారికి ఇతర శిక్ష పడుతుందని, పిల్లలు వాహనాలకు దూరంగా ఉండాలని కోరారు. తల్లిదండ్రులు వాహనంపై బయటకు వెళ్లే ముందు పిల్లల స్వయంగా తండ్రికి హెల్మెట్ ఇవ్వాలని పిలుపునిచ్చారు. అనంతరం పదో తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ ఇప్పటినుంచి బాగా చదువుకుంటే ఉత్తమ ఫలితాలు వస్తాయి అని పేర్కొన్నారు. పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయుడు బొలిశెట్టి రాజన్న, ఉపాధ్యాయులు రజిని, వెంకట మల్లు, రాజమౌళి భూమన్న, గంగన్న తదితరులు పాల్గొన్నారు.



# యువత జరభద్రం లఘు చిత్రం పోస్టర్ల ఆవిష్కరణ



**మంచర్యాల, జనవరి 6 (ప్రభాత సమాచారం)**

సమాజంలో యువత చెడు వ్యసనాలకు బానిసై తమ జీవితాలను ఏ విధంగా నాశనం చేసుకుంటున్నారో అద్దం పట్టే 'యువత జరభద్రం' లఘు చిత్రం పోస్టర్లను మంగళవారం మంచిర్యాల డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ కార్యాలయంలో డీసీపీ ఎగ్గడి భాస్కర్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. లఘు చిత్రం సందేశం మార్గదర్శకులు గుండేటి యోగేశ్వర్, ఉత్తమ ఎన్సీసీ క్యాడెట్ నార్ల మహేందర్ దర్శకత్వంలో యువత చదువును నిర్లక్ష్యం చేస్తూ తప్పుడు స్నేహాలతో చెడు వ్యాసనలకు అలవాటు పడితే వారి భవిష్యత్తు ఎలా చెడి పోతుందో తెలిపే గంజాయి, మద్యం, మాదకద్రవ్యాలు లాంటి మత్తు పదార్థాలకు యువత బానిస కావద్దని ఈ లఘుచిత్రం ద్వారా వివరించామన్నారు. ఈ చిత్రాన్ని 'టీ బ్రేక్ణ యూ ట్యూబ్ ఛానల్ లో వీక్షంచవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో నటులు ఆకాష్, అనిల్, సాగర్, చిత్ర బృందం తదితరులు పాల్గొన్నారు.



### ముసాయిదా ఓటరు జాబితాలో

# పొరపాట్ల సవరణకు చర్యలు

## మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల, జనవరి 6 (ప్రభాత సమాచారం)**

మున్సిపల్ ఎన్నికలలో భాగంగా ముసాయిదా ఓటరు జాబితాలో పొరపాట్ల సవరణకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య, డిప్యూటీ ట్రైనింగ్ కలెక్టర్ మహమ్మద్ విలాయత్ అలీ, మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావు లతో కలిసి మున్సిపల్ కమిషనర్లు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ ముసాయిదా ఓటరు జాబితా, పోలింగ్ కేంద్రాలపై ఏవైనా అభ్యంతరాలు, పొరపాట్లు ఉన్నట్లయితే మున్సిపల్ కమిషనర్‌కు రాతపూర్వకంగా అందించినట్లయితే సవరించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ముసాయిదా ఓటరు జాబితా ప్రకారం జిల్లాలోని మున్సిపాలిటీ లు, మున్సిపల్ కార్పొరేషన్ లో మొత్తం 149 వార్డులకు గాను, 2 లక్షల 94 వేల 641 మంది ఓటర్లు ఉన్నారని, ముసాయిదా పోలింగ్ కేంద్రాల జాబితా ప్రకారం మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో 264, లక్షట్టిపేట మున్సిపాలిటీలో 30, బెల్లంపల్లి మున్సిపాలిటీలో 68, చెన్నూరు మున్సిపాలిటీలో 36, క్యాతనపల్లి మున్సిపాలిటీలో 45 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రాలలో కనీస సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని, పోలింగ్ కేంద్రాల విషయంలో అభ్యంతరాలు ఉన్నట్లయితే వెంటనే తెలియజేయాలని తెలిపారు. డి లిమిటేషన్ ప్రక్రియలో నిర్ధారణ చేసిన హద్దుల ప్రకారమే ముసాయిదా ఓటరు జాబితా రూపొందించడం జరిగిందని, మార్పులు ఏమైనా ఉన్నట్లయితే సరి చేయడం జరుగుతుందని తెలిపారు. రాజకీయ పార్టీలు పోలింగ్ కేంద్రాలకు తమ పార్టీల నుండి బూత్ స్థాయి ఏజెంట్లను ఏర్పాటు చేయాలని, తమ పరిధిలో డబల్ ఓట్ల సంబంధిత సమాచారం ఈ ఆర్ ఓ లకి ఇవ్వాలని, డబల్ ఓట్లు ఉన్నట్లయితే ఎ.డి.ఎస్. (ఆబ్సెంట్, షిఫ్ట్, డెత్) జాబితా ద్వారా ద్వారా ఓటు దుర్వినియోగం కాకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. అక్టోబర్ 1వ తేదీన ప్రచురించబడిన ఓటరు జాబితా ప్రకారమే ముసాయిదా జాబితా తయారు చేయడం జరిగిందని, ఈ విషయాన్ని గమనించాలని కోరారు. ముసాయిదా ఓటరు జాబితాపై అందిన దరఖాస్తులను, అభ్యంతరాలను పరిశీలించి ఈ నెల 10వ తేదీన తుది ఓటరు జాబితా ప్రచురించడం జరుగుతుందని, జాబితా తయారీలో బూత్ స్థాయి అధికారులు, బూత్ స్థాయి ఏజెంట్లు సమన్వయంతో పని చేసి స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.



# వందశాతం తప్పులేని ఓటర్ జాబితా రూపొందించాలి



**ఆదిలాబాద్, జనవరి 6 (ప్రభాత సమాచారం)**

మున్సిపల్ ఎన్నికల దృష్ట్యా ఓటర్ జాబితా సవరణను ఎలాంటి తప్పులు లేకుండా చేపట్టి, ఆరోగ్యవంతమైన ఓటర్ జాబితాను సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం మున్సిపల్ కార్యాలయంలో వార్డు అధికారులు, కంప్యూటర్ ఆపరేటర్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. గత మున్సిపల్ ఎన్నికల ఓటర్ జాబితాను ఆధారంగా తీసుకొని, వార్డుల వారిగా క్షేత్రస్థాయిలో పర్యటనలు నిర్వహించి జాబితాను నవీకరించాలని సూచించారు. లోకాలిటీ, హౌస్ నంబర్, ఓల్డ్ ఓటర్ లిస్ట్ వివరాలను క్షణ్ణంగా పరిశీలించి, సంబంధిత ఓటరు వార్డు బౌండరీలో ఉన్నారా లేదా అన్న విషయాన్ని నిర్ధారించాలని అన్నారు. ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ప్రతి నమోదు సరిచూసి వందశాతం తప్పులేని ఓటర్ జాబితాను రూపొందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రాజేశ్వర్, శిక్షణ కలెక్టర్ సలోని చాబ్ర, మున్సిపల్ కమిషనర్ రాజు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



### ఈనెల 17 నుంచి సీఎం

# కప్ క్రీడా పోటీలు

**నిర్మల్, జనవరి 6 (ప్రభాత సమాచారం)**



రాష్ట్ర క్రీడలు యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆదేశం మేరకు ఈ నెల 17 నుంచి సీఎం కప్ 2026 క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా అధికారి శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. 17 నుంచి 22 వరకు గ్రామస్థాయి 28 నుంచి 31 వరకు మండల స్థాయి వచ్చె నెల మూడు నుంచి ఏడు వరకు నియోజకవర్గ స్థాయి 10 నుంచి 14 వరకు జిల్లాస్థాయి పోటీలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు ఈ పోటీల్లో విజేత లేని వారికి 14 నుంచి 26 వరకు రాష్ట్రస్థాయిలో జరిగే పోటీలో పాల్గొంటారని మొత్తం 38 క్రీడా విభాగాల్లో ఈ పోటీలను నిర్వహించడం జరుగుతుందని ఈ అవకాశాన్ని క్రీడాకారులు చదివించుకోవాలన్నారు.

# శ్రీకృష్ణ మందిర నిర్మాణానికి భూమి పూజ

**బోథ్, జనవరి 6 (ప్రభాత సమాచారం)**

బోథ్ మండలంలోని కనుగుట్ట గ్రామంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో నిర్మించనున్న శ్రీకృష్ణ మందిర నిర్మాణానికి మంగళవారం యాదవ సంఘం సభ్యులతో కలిసి కనుగుట్ట సర్పంచ్ అనిత రాజేందర్ భూమి పూజ చేశారు. త్వరలో మందిర నిర్మాణ పనులు ప్రారంభమవుతాయని సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ పాలకవర్గ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.





### హత్యాయత్నం కేసులో


# నిందితుడి అరెస్ట్

**మందమర్రి, జనవరి 6 (ప్రభాత సమాచారం)**

బెల్లంపల్లి బూడిదగడ్డకు చెందిన గొర్ల అఖిల్ అనే వ్యక్తిని పాత కక్షల నేపథ్యంలో పథకం ప్రకారం హత్య చేసేందుకు ప్రయత్నించిన కేసులో ఒక నిందితుడిని మందమర్రి పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను మందమర్రి ఎస్ఐ రాజశేఖర్ వెల్లడించారు. బెల్లంపల్లికి చెందిన ఆశ సంతోష్(అలియాస్ పప్పు), నరేష్‌లకు గొర్ల అఖిల్ అనే వ్యక్తితో పాత గొడవలు ఉన్నాయి. ఈ కక్షతో అఖిల్‌ను హతమార్చాలని వారు పథకం రచించారు. ఈ క్రమంలో ఈవెంట్ కోఆర్డినేటర్‌గా పనిచేస్తున్న కొంతెం భార్గవ్ (25) సహాయం కోరారు. భార్గవ్ తన స్నేహితుల ద్వారా రెండు స్విఫ్ట్ డిజైర్ కార్లను అద్దెకు (ావశ్రీట-ంతీఅజవ) తీసుకుని నిందితులకు అందజేశాడు.

**హత్యాయత్నం జరిగిన తీరు..**

ఈ నెల 5వ తేదీన అఖిల్ మందమర్రిలోని సిఇఆర్ క్లబ్(జజు= జశ్రీబఎ) వద్దకు వస్తున్నాడనే సమాచారంతో, నిందితులు రెండు కార్లలో అక్కడికి చేరుకున్నారు. అఖిల్ కారు దిగగానే పప్పుఏఆశ సంతోష్ తన కారుతో బలంగా ఢీ కొట్టి, అనంతరం దాడి చేయాలని ప్లాన్ చేశారు. పథకం ప్రకారం అఖిల్ కారును ఢీకొట్టగా, అఖిల్ అప్రమత్తమై తప్పించుకోవడంతో ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. పథకం విఫలం కావడంతో నిందితులు అక్కడి నుంచి పరారయ్యారు. నిందితుడు అయిన కొంతమ్ భార్గవ్ తన స్నేహితుడైన మంచిర్యాల కి చెందిన గణేష్ అనే వ్యక్తి ద్వారా మంచిర్యాలకు చెందిన శ్రీకాంత్ అనే వ్యక్తికి చెందిన రెండు స్విఫ్ట్ డిజైర్ కారులను తీసుకొని , ఇట్టి హత్యాయత్నంలో ఉపయోగించాడు. అయితే సాంకేతిక పరిజ్ఞానం ద్వారా నిందితులు ఉపయోగించిన కార్లు గుర్తించి ఈ రోజు ఒక కారులో వెళ్తున్న కొంతెం భార్గవ్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా అసలు విషయం వెలుగులోకి వచ్చింది. నిందితుడి నుంచి గ్రే కలర్ స్విఫ్ట్ డిజైర్ కారు, సెల్‌ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ప్రధాన నిందితులైన ఆశ సంతోష్ (పప్పు), నరేష్ ముగ్గురు వ్యక్తులు ప్రస్తుతం పరారీలో ఉన్నారు. వారి కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశామని, బెల్లంపల్లి ఏసిపి రవికుమార్, మందమర్రి సర్కిల్ ఇన్స్పెక్టర్ శశిధర్ రెడ్డి పర్యవేక్షణలో రెండు స్పెషల్ టీమ్ లను ఏర్పాటు చేశామని, త్వరలోనే మిగిలిన నిందితులందరినీ పట్టుకుంటామని మందమర్రి ఎస్.ఐ రాజశేఖర్ తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



# రిలీజ్ రూమర్స్‌కి చెక్..

మెగాపవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా జాన్వీ కపూర్ హీరోయిన్ గా టాలెంటెడ్ దర్శకుడు బుచ్చిబాబి సానా కాంబినేషన్ లో తెరకెక్కిస్తున్న సాలిడ్ రూరల్ రస్టిక్ డ్రామా "పెద్ది" మంచి అంచనాలు సెట్ చేసుకున్న ఈ సినిమా కోసం అభిమానులు గట్టి అంచనాలు పెట్టుకున్నారు. అయితే ఇటీవల ఈ సినిమా రిలీజ్ కి సంబంధించి పలు రూమర్స్ గుప్పుమన్నాయి. ఆల్రెడీ మేకర్స్ మార్చ్ 27 రామ్ చరణ్ బర్త్ డే బ్లాస్ట్ గా ఈ సినిమాని కన్ఫర్మ్ చేసి కూర్చుకున్నారు కానీ దీనిపై కొత్త అప్డేట్ రూపంలో ఓ క్లారిటీ అయితే వచ్చింది.ప్లానింగ్ ప్రకారం పెద్ది షూటింగ్ ని బుచ్చిబాబు తెరకెక్కిస్తున్నాడు. అయినప్పటికీ ఈ సినిమా ఏకంగా మార్చ్ నుంచి డిసెంబర్ కి వాయిదా పడింది అంటూ పలు రూమర్స్ మొదలయ్యాయి. దీనికి కారణం రెహమాన్ కొంచెం ఎక్కువ సమయం తీసుకొని స్కోర్ అందిస్తున్నారు అంటూ ఓ వెర్షన్ వినిపించింది. కానీ లేటెస్ట్ గా రెహమాన్ బర్త్ డేకి విషెస్ చెబుతూ రిలీజ్ చేసిన పోస్టర్ అప్డేట్ లోనే ఈ సినిమా ఆన్ టైం మార్చ్ 27నే వస్తున్నట్టుగా కన్ఫర్మ్ చేశారు. సో ఆ రూమర్స్ కి ఇది చెక్ మేట్ అనుకోవచ్చు. గతంలో కూడా పలు సినిమాలు రిలీజ్ వాయిదా రూమర్స్ ముందు మేకర్స్ ఇలా అప్డేట్స్ ఇచ్చిన సందర్భాలు కూడా ఉన్నాయి కానీ చివరి నిమిషంలో వాయిదాలు పడ్డాయి. మరి ఆ ఫార్మాట్ లో కాకుండా పెద్ది అభిమానులకి స్పెషల్ దేన వస్తుందో లేదో కాలమే నిర్ణయించాలి. సో నెక్స్ట్ వచ్చే అప్డేట్స్ కోసం వేచి చూడాలి.



# ‘అనగనగా ఒక రాజు’ ట్రైలర్ వాయిదా..


టాలీవుడ్ హీరో నవీన్ పొలిశెట్టి నటిస్తున్న లేటెస్ట్ చిత్రం 'అనగనగా ఒక రాజు' సంక్రాంతి బరిలో గ్రాండ్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. ఇక ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా ఈ మూవీ నుంచి ట్రైలర్ లాంచ్‌కు మేకర్స్ రెడీ అవుతున్నారు. అయితే, తొలుత ఈ చిత్ర ట్రైలర్‌ను జనవరి 7న లాంచ్ చేయాలని మేకర్స్ ప్లాన్ చేశారు. ఈ మేరకు అధికారిక ప్రకటన కూడా చేశారు.కానీ, అదే రోజు వరుస మూవీ ఈవెంట్స్ ఉండటంతో ఈ చిత్ర ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌ను వాయిదా వేశారు. 'అనగనగా ఒక రాజు' మూవీ ట్రైలర్‌ను జనవరి 8న ఉదయం 10 గంటల నుంచి శ్రీరాములు థియేటర్‌లో లాంచ్ చేయబోతున్నట్లు చిత్ర యూనిట్ తాజాగా ప్రకటించింది. దీంతో ఈ వాయిదా చాలా మంచిదని పలువురు కామెంట్స్ చేస్తున్నారు.ఇక ఈ సినిమాను దర్శకుడు మారి డైరెక్ట్ చేయగా పూర్తి కామెడీ ఎంటర్‌టైనర్‌గా ఈ మూవీ ప్రేక్షకులను ఎంటర్‌టైన్ చేయనుంది. ఈ సినిమాలో అందాల భామ మీనాక్షి చౌదరి హీరోయిన్‌గా నటిస్తుండగా మిక్కీ జే మేయర్ ఈ సినిమాకు సంగీతం అందిస్తున్నారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చున్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై నాగవంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని ప్రొడ్యూస్ చేస్తున్నారు.

# ‘టాక్సిక్’లోకి రుక్మిణి వసంత్

యశ్ హీరోగా మలయాళ దర్శకురాలు గీతూమోహన్‌దాస్ ‘టాక్సిక్’ చిత్రాన్ని తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. ‘ఏ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్ అప్స్' అనేది ట్యాగ్ లైన్. ప్రస్తుతం దీని షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. తాజాగా ఈ సినిమాలో రుక్మిణి వసంత్ ఉన్నట్లు టీమ్ ప్రకటించింది. ఇందులో ఆమె మెలిసా అనే పాత్రలో కనిపించనున్నారు. ఈ విషయాన్ని తెలుపుతూ ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. మోడ్రన్ డ్రెస్‌లో పబ్‌లో నడుస్తూ రుక్మిణి కనిపిస్తున్నారు.ఇప్పటికే ఈ సినిమాలో ముగ్గురు హీరోయిన్‌ల లుక్‌ను విడుదల చేశారు. ఇప్పుడు రుక్మిణి కూడా అందులో ఉన్నట్లు అధికారికమైంది. దీంతో ఇందులో నలుగురు హీరోయిన్స్ అయ్యారు. నదియా పాత్రలో కియారా కనిపించనుండగా హ్యూమా ఖురేషీ ఎలిజబెత్‌గా, నయనతా గంగ పాత్రలో అలరించనున్నారు.

చిన్నారుల కోసం ఎన్నో కథలు తెరకెక్కాయని, ఇది పెద్దలకు సందేశమిచ్చే చిత్రమని యశ్ ఓ ఇంటర్వ్యూలో తెలిపారు. భారీ అంచనాల మధ్య వచ్చే ఏడాది మార్చి 19న ప్రేక్షకుల ముందుకు రానుంది.





# ‘ది రాజాసాబ్’ రన్‌టైమ్ ఫిక్స్..

మూడు గంటల రన్‌టైమ్. ప్రస్తుతం పాన్ ఇండియా కథలన్నీ కాస్త అటూ ఇటూగా ఇదే నిడివితో వస్తున్నాయి. ఈ విషయంలో అగ్ర కథానాయకుడు ప్రభాస్ ఓ అడుగు ముందున్నారు. 'బాహుబలి' తర్వాత ఆయన చేసిన సినిమాలన్నీ ఇలాగే అలరించాయి. ఇప్పుడు మారుతి దర్శకత్వంలో ఆయన నటించిన హారర్ ఫాంటసీ థ్రిల్లర్ 'ది రాజాసాబ్' కూడా అదే బాటలో పయనిస్తోంది. సంక్రాంతి కానుకగా జనవరి 9న ) ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇటీవల సెన్సార్ పూర్తి చేసుకున్న ఈ మూవీ రన్‌టైమ్ బయటకు వచ్చింది. 3 గంటలా 9 నిమిషాలతో ప్రేక్షకులను సరికొత్త ప్రపంచంలో 'ది రాజాసాబ్' అలరించనుంది. సినిమాలో తల నరికే సన్నివేశానికి మాత్రం సెన్సార్ కట్ చెప్పింది.జనవరి 9న ఈ చిత్రం విడుదల కానుండగా, ఒకరోజు ముందుగానే అంటే జనవరి 8న రాత్రి స్పెషల్ ప్రీమియర్‌లను ఏర్పాటు చేసేందుకు చిత్ర బృందం సన్నాహాలు చేస్తోంది. ఇప్పటికే ఇందుకు సంబంధించిన అనుమతుల కోసం రెండు తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలకు దరఖాస్తు చేసుకుంది. తెలంగాణలో ఉదయం 4గంటల షోకు కూడా అనుమతి ఇవ్వాలని కోరింది. స్పెషల్ ప్రీమియర్ టికెట్ ధరను సింగిల్ స్క్రీన్‌లో రూ.800 (పన్నులతో కలిపి).. మల్టీప్లెక్స్‌లలో రూ.1000 (పన్నులతో కలిపి) పెంచుకునేలా అనుమతి ఇవ్వాలని కోరింది. జనవరి 9న నుంచి 11 వరకూ సింగిల్ స్క్రీన్‌లో రూ.105 (పన్నులతో కలిపి).. 12 నుంచి 18వ తేదీ వరకూ రూ.62 (పన్నులతో కలిపి).. మల్టీప్లెక్స్‌లో వరుస తేదీల్లో రూ.132, రూ.89 పెంచుకునేలా అనుమతి ఇవ్వాలని కోరింది. త్వరలోనే దీనిపై సినిమాటోగ్రఫీశాఖ అధికారులు నిర్ణయం తీసుకోనున్నారు. ఇందుకు సంబంధించిన ప్రకటన రాగానే బుకింగ్స్ ఓపెన్ అయ్యే అవకాశం ఉంది.

# శరవేగంగా జీవిత కథ



బాలీవుడ్ నటి శ్రద్ధా కపూర్ ప్రధాన పాత్రలో జానపద నృత్య కళాకారిణి విఠాబాయి నారాయణగావ్కర్ జీవితాధారంగా.. దర్శకుడు లక్ష్మణ్ ఉటేకర్ ఓ చిత్రం తెరకెక్కిస్తున్నట్లు ఎప్పటినుంచో ప్రచారంలో ఉన్న సంగతి తెలిసిందే. కొన్ని కారణాలతో ఆగిపోయిన ఈ సినిమా చిత్రీకరణ తాజాగా మళ్లీ మొదలైనట్లు సమాచారం. "ఈ జీవిత కథలో శ్రద్ధ పోషిస్తున్న పాత్ర కోసం శారీరకంగా, భావోద్వేగ పరంగానూ చాలా కఠినంగా ఉండాల్సిన అవసరం ఉంది. ఈ మధ్య ఒక నృత్య సన్నివేశంలో ఆమె గాయపడడంతో సినిమా చిత్రీకరణ కొంతకాలం ఆగిపోయింది. కానీ, అది షెడ్యూల్ మొత్తాన్ని ఏ మాత్రం ప్రభావితం చేయలేదు. శ్రద్ధ అనుకున్న సమయానికే సినిమా షెడ్యూల్స్‌ని పూర్తి చేసేందుకు ప్రయత్నిస్తోంది. నిర్మాతలు మార్చి నెల నాటికి చిత్రీకరణ ముగించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఆమె ఈ సినిమా తర్వాత ఏప్రిల్‌లో హై కాన్సెప్ట్ ఫాంటసీ చిత్రం 'నాగిన్'లో నటించేందుకు సన్నద్ధమవుతోంద"ని బాలీవుడ్ సన్నిహిత వర్గాల సమాచారం.



■ ప్రభాత సమాచారం, ఆదిలాబాద్ ప్రతినిధి

■ గండ్లు పూడ్చరు.. కడగండ్లు తీర్చరు ■ ఏటేటా తగ్గిపోతున్న వట్టివాగు ఆయకట్టు ■ ఈ యాసంగిలో వరిపై ఆశలు వదులుకోవాల్సిందేనా..!

■ నీరున్నా ఉపయోగం సున్నా... సాగు నీటికి బ్రేక్ ■ ఎండుతున్న పంటలు ■ ఆరుతడి పంటలను మాత్రమే సూచిస్తున్న అధికారులు

వట్టివాగు ప్రాజెక్టు భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారుతున్నది. యేటేటా ఓపెన్‌కాస్టు మట్టితో ప్రాజెక్టును నింపుతుండగా, మున్ముందు ఆయకట్టు సాగు కష్టమేనన్న ప్రశ్న తలెత్తుతున్నది. ఇక ప్రస్తుతం కాలువలకు మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో సాగు నీరందించలేమని, రైతులు ఆరుతడి పంటలు మాత్రమే వేసుకోవాలని యంత్రంగాం సూచిస్తున్నది. జిల్లాలోని కుమ్రం భీం ప్రాజెక్టు తర్వాత చెప్పుకోదగ్గది వట్టివాగు ప్రాజెక్టు. దాదాపు 27 వేల ఎకరాలకు సాగునీరందించే లక్ష్యంతో దీనిని నిర్మించారు. 2.06 టీఎంసీల నీటి సామర్థ్యంతో దీనిని నిర్మించారు. 2001లో ఈ ప్రాజెక్టును పూర్తి చేసినప్పటి నుంచి ఏ యేడాది కూడా పూర్తిస్థాయిలో సాగు నీరందించలేకపోయింది. ప్రాజెక్టులో నీటి నిల్వలు ఉన్నప్పటికీ వాటిని పంటలకు వినియోగించలేని దుస్థితి నెలకొంది. ప్రాజెక్టులో ప్రస్తుతం 2.00 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నపటికీ కనీసం యాసంగి పంటలకు కూడా నీరు అందించలేని పరిస్థితి ఉంది. పాలకుల నిర్లక్ష్యం, అధికారుల అలసత్వం కలిసి ప్రాజెక్టులోని నీరు రైతులకు ఏమాత్రం ఉపయోగపడడం లేదు. కాలువలకు మరమ్మతులు చేయకపోవడం.. పూడికతో నిండిపోవడం.. ఎక్కడికక్కడ ధ్వంసం కావడంతో శిథిలావస్థకు చేరుకున్నాయి. 27 వేల ఎకరాలకు నీరందించే లక్ష్యంతో నిర్మించిన ఈ ప్రాజెక్టు ప్రస్తుతం 1500 ఎకరాలకు మాత్రమే సాగు నీరందిస్తున్నది. ఈ ఏడాది కాలువల మరమ్మతులకు నిధులు మంజూరయ్యాయని చెబుతున్న అధికారులు, వేసవిలో కాలువల మరమ్మతులు చేయనున్న కారణంగా నీరివ్వడం సాధ్యం కాదని, కనుక రైతులు ఆరుతడి పంటలను మాత్రమే వేసుకోవాలని సూచిస్తున్నారు. దీంతో ప్రాజెక్టు కింద సాగవుతున్న ఆ మాత్రం సాగు కూడా ప్రశ్నార్థకంగా మారింది.



# భద్రత వట్టిదేనా సాగు ప్రశ్నార్థకం..!

వట్టివాగు ప్రాజెక్టు భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారుతున్నది. యేటేటా ఓపెన్‌కాస్టు మట్టితో ప్రాజెక్టును నింపుతుండగా, మున్ముందు ఆయకట్టు సాగు కష్టమేనన్న ప్రశ్న తలెత్తుతున్నది. ప్రస్తుతం కాలువలకు మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో సాగు నీరందించలేమని, రైతులు ఆరుతడి పంటలు మాత్రమే వేసుకోవాలని యంత్రంగాం సూచిస్తున్నది.

**నీరున్నా ఉపయోగం సున్నా...**

జిల్లాలోని కుమ్రం భీం ప్రాజెక్టు తర్వాత చెప్పుకోదగ్గది వట్టివాగు ప్రాజెక్టు. దాదాపు 27 వేల ఎకరాలకు సాగునీరందించే లక్ష్యంతో దీనిని నిర్మించారు. 2.06 టీఎంసీల నీటి సామర్థ్యంతో దీనిని నిర్మించారు. 2001లో ఈ ప్రాజెక్టును పూర్తి చేసినప్పటి నుంచి ఏ యేడాది కూడా పూర్తిస్థాయిలో సాగు నీరందించలేకపోయింది. ప్రాజెక్టులో నీటి నిల్వలు ఉన్నప్పటికీ వాటిని పంటలకు వినియోగించలేని దుస్థితి నెలకొంది. ప్రాజెక్టులో ప్రస్తుతం 2.00 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నపటికీ కనీసం యాసంగి పంటలకు కూడా నీరు అందించలేని పరిస్థితి ఉంది. పాలకుల నిర్లక్ష్యం, అధికారుల అలసత్వం కలిసి ప్రాజెక్టులోని నీరు రైతులకు ఏమాత్రం ఉపయోగపడడం లేదు. కాలువలకు మరమ్మతులు చేయకపోవడం.. పూడికతో నిండిపోవడం.. ఎక్కడికక్కడ ధ్వంసం కావడంతో శిథిలావస్థకు చేరుకున్నాయి. 27 వేల ఎకరాలకు నీరందించే లక్ష్యంతో నిర్మించిన ఈ ప్రాజెక్టు ప్రస్తుతం 1500 ఎకరాలకు మాత్రమే సాగు నీరందిస్తున్నది. ఈ ఏడాది కాలువల మరమ్మతులకు నిధులు మంజూయ్యాయని చెబుతున్న అధికారులు, వేసవిలో కాలువల మరమ్మతులు చేయనున్న కారణంగా నీరివ్వడం సాధ్యం కాదని, కనుక రైతులు ఆరుతడి పంటలను మాత్రమే వేసుకోవాలని సూచిస్తున్నారు. దీంతో ప్రాజెక్టు కింద సాగవుతున్న ఆ మాత్రం సాగు కూడా ప్రశ్నార్థకంగా మారింది.

**సాగు నీటికి బ్రేక్..**

వట్టివాగు ప్రాజెక్టు ఆయకట్టుపై రైతులు ఆశలు వదులుకోవాల్సి వస్తోంది. కాలువల మరమ్మతుల కారణంగా యాసంగిలో వరిసాగుకు పూర్తిస్థాయిలో నీరు అందించలేమని అధికారులు ప్రకటించారు. ప్రాజెక్టు కింద ఆరుతడి పంటలు మాత్రమే సాగుచేసుకోవాలని సూచిస్తున్నారు. 27 వేల ఎకరాలకు సాగునీరందించాల్సిన ఈ ప్రాజెక్టు ఆయకట్టును అనేక ఏళ్లుగా పట్టించుకోకపోవడంతో ప్రస్తుతం సుమారు 2 వేల లోపు ఎకరాలకు సాగునీరందుతోంది. ఓపెన్ కాస్టు పూడికమట్టితో ఓ వైపు నీటి సామర్థ్యం తగ్గిపోయింది. మరోవైపు కాలువలకు మరమ్మతులు చేయకపోవడంతో పంటలకు సాగునీరందించే పరిస్థితి లేకుండా పోతున్నది. ఆసిఫాబాద్, రెబ్బెన మండలాల్లోని పంటలకు సాగు నీరందించే ఈ ప్రాజెక్టు.. కేవలం రెబ్బెన మండలంలోని కొద్దిపాటి పంటలు మాత్రమే నీరందిస్తున్నది. ఈ ఏడాది కాలువల మరమ్మతులకు రూ. 60 లక్షలు మంజూరయ్యాయని, ఆ కారణంగా పంటలకు నీరు ఇవ్వలేమని, రైతులు ఆరుతడి పంటలు మాత్రమే వేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

**వరి సాగు వద్దు..**

వట్టివాగు ప్రాజెక్టు ద్వారా వారబంధీ విధానంలో అధికారులు సాగునీటిని విడుదల చేస్తున్నారు. డిసెంబర్ ఒకటి నుంచి విడుతల వారీగా ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేస్తున్న అధికారులు మార్చి 31 వరకు ఇదే పద్ధతిలో నీటిని విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. ఆ తర్వాత ఏప్రిల్, మే నెలల్లో కాలువల్లో పూడికతీత, ఇతర మరమ్మతుల పనులు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. వట్టివాగు కింద రైతులు వరి పంటను సాగు చేయవద్దని సూచిస్తున్నారు. దీంతో రైతులు వరి సాగును వదిలేసి ఆరుతడి పంటలు వయాలని భావిస్తున్నారు. వరి సాగుచేస్తే మార్చినాటికి పంట పూర్తికాకపోవతే నష్టాలను చూడాల్సి వస్తుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సుమారు 30 ఏళ్ల క్రితం నిర్మించిన వట్టివాగు ప్రాజెక్టు పాలకులను పట్టించుకోకపోవడంతో పూర్తిగా ధ్వంసమయ్యాయి. చాలా చోట్ల కాలువలు కూలిపోవడం, పూడిక, గడ్డి మొక్కలతో కాలువలు ఆనవాళ్లు కోల్పోయాయి. దీంతో ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేసినా పంటలకు వరకు నీరు చేరే పరిస్థితి లేదు.

**వరి సాగు వద్దు...**

వట్టివాగు ప్రాజెక్టు గల రెండు ప్రధాన కాలువలతోపాటు 18 చిన్న కాలువలు ఉన్నాయి. కుడికాలువ 21 కిలోమీటర్లు, ఎడమ కాలువ ఏడు కిలోమీటర్ల ఉన్నాయి. ప్రధాన కాలువలతో పాటు చిన్నకాలవల్లో సైతం పూడిక పేరుకుపోయింది. కాలువల మరమ్మతులకు టెండర్లు పూర్తికావడంతో ఈ వేసవిలో మరమ్మతులు చేసేందుకు నీటి పారుదల శాఖ అధికారులు చర్యలు చర్యలు చేపడుతున్నారు. దీనిలో భాగంగా ఆయకట్టుకు నీరు విడుదల చేసేందుకు వారబంధీ పద్ధతిని అమలు చేస్తున్నారు. వారానికోసారి మాత్రమే నీటిని విడుదల చేస్తున్నారు. వరి పంట సాగు చేయరాదని చెబుతున్నారు. ఆరుతడి పంటలైన మొక్కజొన్న, గోదుమ, వేరుశనగా, శనగా ఇతర చిరుధాన్యాలను మాత్రమే సాగుచేయాలని సూచిస్తున్నారు. ఓపెన్‌కాస్ట్ మట్టికారణంగా కూడుకుపోతున్న వట్టివాగు ద్వారా రాబోయే రోజుల్లో పంటలు సాగుచేయటం కష్టమేన్న అనుమానాలను రైతులు వ్యక్తం చేస్తున్నారు.

## రహదారి భద్రత నిబంధనలను పాటించాలి

### మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల, జనవరి 6 (ప్రభాత సమాచారం)**

రహదారి భద్రత నిబంధనలను ప్రతి ఒక్కరు తప్పనిసరిగా పాటించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని మందమర్రి మండలంలోని టోల్ ప్లాజా వద్ద 37 వ జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలు – 2026 పురస్కరించుకొని నిర్వహించిన కార్యక్రమంలో బెల్లంపల్లి ఎ.సి.పి. రవికుమార్, జాతీయ రహదారుల సంస్థ జి.ఎం.(టి) డిపి.డిఎన్. అజయ్ మణికుమార్ లతో కలిసి వాహనదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రహదారి భద్రత నిబంధనలను ప్రతి ఒక్కరు పాటించాలని, సురక్షతంగా గమ్య స్థానాలకు చేరుకోవాలని తెలిపారు. రోడ్డు ప్రమాదాలలో ఎక్కువగా యువత మరణానికి గురవుతున్నారని, ట్రాఫిక్ నియమాలను పాటించకపోవడం ప్రమాదాలకు ప్రధాన కారణంగా తెలుస్తుందని తెలిపారు. వాహనాన్ని వేగంగా నడపడం, పరిమితికి మించి లోడ్ తో ప్రయాణించడం కారణంగా వాహనాలు అదుపు తప్పుతాయని, అందువలన ప్రమాదం జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కార్లు నడిపేవారు సీట్ బెల్ట్ లేకుండా ప్రయాణించడం, జాతీయ రహదారిపై వాహనాలను నిలుపుదల చేయడం, పశువులను రహదారిపైకి వదలడం చేయవద్దని, ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని, తద్వారా ప్రమాదాలను నియంత్రించవచ్చని తెలిపారు. జాతీయ రహదారుల సిబ్బంది రహదారి నియమ, నిబంధనలను పాటించేలా వాహనదారులకు అవగాహన కల్పించాలని, రహదారులపై పని చేసే సిబ్బంది సైతం పని చేసే సమయంలో సేఫ్టీ కిట్స్ ధరించాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ సరైన కండిషన్ లో ఉన్న వాహనాన్ని మాత్రమే ఉపయోగించాలని, మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, డ్రైవింగ్ చేస్తూ మొబైల్‌లో మాట్లాడవద్దని, ట్రాఫిక్ భద్రత నియమాలను పాటించాలని తెలిపారు. జిల్లాలో రహదారి ప్రమాదాల నివారణకు విస్తృత స్థాయిలో తనిఖీలు చేపడుతున్నామని, రహదారులపై వేగ నియంత్రణ కొరకు చర్యలు తీసుకోవడంతో పాటు ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి వాహనదారులకు తెలిసే విధంగా సూచికలు ఏర్పాటు చేసి చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# 9వ తేదీలోగా అభ్యంతరాలు తెలియజేయాలి

## కలెక్టర్ వెంకటేష్ దోత్రే



**ఆసిఫాబాద్, జనవరి 6 (ప్రభాత సమాచారం)**
మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో భాగంగా వార్డుల వారిగా ఓటరు జాబితాపై ఈ నెల 9వ తేదీ లోగా అభ్యంతరాలు తెలియజేయాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ దీపక్ తివారి, డేవిడ్, సబ్ కలెక్టర్ శ్రద్ధశుక్లా, ఆర్డీవో లోకేశ్వర్‌రావులతో కలిసి మున్సిపల్ ఎన్నికల భాగంగా మంగళవారం ముసాయిదా ఓటరు జాబితా, పోలింగ్ కేంద్రాలు, పోలింగ్ కేంద్రాల ప్రదేశాల విషయంలో అభ్యంతరాలపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ మున్సిపాలిటీలకు సంబంధించిన ముసాయిదా ఓటరు జాబితా పరకటించడం జరిగిందని, జాబితాలో పొందు పరిచిన వివరాలను పరతి ఓటరు పరిశీలించుకోవాలని తెలిపారు. జాబితాలో పేర్లపై ఏమైన అభ్యంతరాలు ఉన్నట్లయితే ఈ నెల 9వ తేదీ లోగా రాతపూర్వకంగా సమర్పించాలని తెలిపారు. ఆసిఫాబాద్ మున్సిపాలిటీలో 13905 మంది ఓటర్లు ఉండగా 24 పోలింగ్ కేంద్రాలు, కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో 51,025 మంది ఓటర్లు ఉండగా 83 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఏ వార్డులో ఉన్న ఓటరు అదే వార్డులో ఉండేలా వార్డు అధికారులు, బూత్ స్థాయి అధికారులు క్షత్రస్థాయిలో సమాచారం సేకరించడం జరుగుతుందని, రాష్ట్ర ఎన్నికల కమీషన్ ఆదేశాల ప్రకారం ఈ నెల 10వ తేదీన తుది ఓట రు జాబితాను ప్రకటించనున్నామని తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు, బూత్ స్థాయి ఏజెంట్లు, ఓటరు జాబితాపై సహకరించాలని, పోలింగ్ కేంద్రాలు, పోలింగ్ కేంద్రాల ప్రాంతాలపై అభ్యంతరాలు ఉన్నట్లయితే వెంటనే సమర్పించాలని అన్నారు. ఎన్నికల కమీషన నిబంధనలు పాటించాలని తెలిపారు. సమస్యాత్మక, అతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. టి పోల్ యాప్‌లో వార్డుల వారీగా ఓటరు జాబితా పరిశీలించుకోవచ్చని ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లు ఒకే వార్డులో ఉండే విధంగా రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులు దృషిటకి తీసుకు రావాలన్నారు. ఎలాంటి అవకతవకలకు అవకాశం లేకుండా స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు, బూత్‌స్థాయి ఏజెంట్లు సహకరించాలని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్లు గజానన్, రాజేందర్, టీపీఓ యశ్వంత్, నాయకులు, సంబంధిత అదికారులు పాల్గొన్నారు.



## గ్రామాల అభివృద్ధిలో సర్పంచుల పాత్ర కీలకం

**బోథ్, జనవరి 6 (ప్రభాత సమాచారం)**
గ్రామాల అభివృద్ధిలో సర్పంచుల పాత్ర కీలక పాత్ర పోషించాలని మీూా అనిల్ జాదవ్ పేర్కొన్నారు. బోథ్ మండలంలోని కనుగుట్ట గ్రామ సర్పంచ్ ఆకుల ఆనిత మంగళవారం సాయంత్రం ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గ్రామంలోని సమస్యలు, పలు అంశాలను ఎమ్మెల్యేకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, గ్రామస్తులు, తదితరులు, పాల్గొన్నారు.

## ఇసుక లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ బోల్తా.. డ్రైవర్ దుర్మరణం

**రెబ్బెన, జనవరి 6 (ప్రభాత సమాచారం)**
గోలేటి టౌన్ షిప్ సమీపంలోని కైరిగూడ వాగు వద్ద ఇసుక లోడుతో వాగు నుండి పైకి ఎక్కుతున్న క్రమంలో ట్రాక్టర్ బోల్తా పడింది. ఈ దుర్ఘటనలో డ్రైవర్ గోలేటి గ్రామంలోని భగత్‌సింగ్ నగర్‌కు చెందిన వెంకటేష్ అక్కడికక్కడే మృతి చెందాడు.



# కుభీర్ ఐకేపి ఏపీఎంగా వందేమాతరం



**కుభీర్, జనవరి 6 (ప్రభాత సమాచారం)**
కుభీర్ మండల ఎపిఎం గా వందేమాతరం మంగళవారం నూతన బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఎంత కాలం పని చేసిన ఇంచార్జ్ ఎపిఎం లక్ష్మణ్ బాధ్యతలు నిర్వహించారు. నూతనంగా బాధ్యతలు తీసుకున్న ఎపిఎం వందేమాతరం బైంసా మండలంలో సీసీగా విధులు నిర్వహిస్తుండగా కుభీర్ ఎపిఎం గా బాధ్యతలు తీసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా నూతన ఎపిఎం వందేమాతరం మాట్లాడుతూ.. మండలంలో ఉన్న మహిళా సంఘాల అభివృద్ధికి తనవంతుగా కృషి చేస్తానని అన్నారు. దింతో సిబ్బంది బాధ్యతలు తీసుకున్న ఎపిఎం వందేమాతరంను సన్మాంచారు. ఈ కార్యక్రమంలో సీసీలు దత్తాత్రి, భూమన్న, పరశురాం, విట్టల్ గంగాధర్, అములు, మోహన్ తదితరులు ఉన్నారు.

# శ్రీ సంత్ సేవాలాల్ మహరాజ్ దీక్ష భూమి జాతర పోస్టర్ల ఆవిష్కరణ



**ఉట్నూర్, జనవరి 6 (ప్రభాత సమాచారం)**
శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ దీక్ష భూమి జాతర పోస్టర్ లను ఆదిలాబాద్ జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ జనార్దన్ రాథోడ్ ఆవిష్కరించాడు. ఈనెల 11న నార్నూర్ మండలంలోని దీక్ష భూమి కొత్తపల్లి లో జరిగే 47వ గురు కృప, గురు మిలన్ దినోత్సవ మహాసభ జాతరకు బంజారా సోదరులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ ఆసిఫాబాద్ ఇంచార్జ్ శ్యాం నాయక్, మాజీ జడ్పిటిసి చారులతా రాథోడ్ తో కలిసి ఆయన పోస్టర్ ఉట్నూర్‌లో మంగళవారం ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు సంఘ నాయకులు రాజకీయ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## పారిశుధ్య కార్మికుల ఆందోళన

**కాగజ్‌నగర్, జనవరి 6 (ప్రభాత సమాచారం)**
కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజనగర్ మున్సిపల్ కార్యాలయంకు తాళం వేసి పారిశుద్ధ కార్మికులు ఆందోళనకు దిగారు. మున్సిపల్ అధికారులు లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించడంతో కార్మికులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులు జోక్యం చేసుకోవడంతో స్వల్ప తోపులాట జరిగింది. ఇద్దరు మహిళా కార్మికులు స్పృహ కోల్పోవడంతో ఆసుపత్రికి తరలించారు. తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చే వరకు సమ్మె విరామించబొమని తెల్చి చెప్పారు.

## ఆరోగ్య లక్ష్మ కమిటీ నియామకం



**రెబ్బెన, జనవరి 6 (ప్రభాత సమాచారం)**
రెబ్బెన మండలం నారాయణపూర్ గ్రామం ఎస్సీ కాలనీ అంగన్వాడీ-2 సెంటర్‌లో జరిగిన సమావేశానికి సూపర్‌వైజర్ విజయ, గ్రామ సర్పంచ్ రవీందర్ హాజరయ్యారు. అంగన్వాడీ సేవలను అర్హులందరూ వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం 11 మంది సభ్యులతో ఆరోగ్య లక్ష్మ కమిటీని నియమించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ జగదీష్, సెక్రటరీ శాంతయ్య, వార్డు సభ్యులు, అంగన్వాడీ టీచర్ శోభ పాల్గొన్నారు.

# వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



**ఆసిఫాబాద్, జనవరి 6 (ప్రభాత సమాచారం)**
వాహనదారులు ట్రాఫిక్ నిబందనలు పాటించాలని కౌటాల సీఐ సంతోష్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. పోలీసు స్టేషన్ నుంచి ప్రధాన వీధుల గుండా ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ వాహనదారులు హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడిపినట్లయితే రోడ్డు ప్రమాదాలు జరిగి కుటుంబాలు రోడ్డున పడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రవీణ్, తహసీల్దార్ రామ్మోహన్, ఎస్సై సర్తాజ్ పాషా తదితరులు పాల్గొన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని కాగజ్‌నగర్‌రూరల్ సీఐ కుమారస్వామి అన్నారు. రోడ్డు భద్రత వారోత్సవాలలో భాగంగా దహెగాం మండల కేంద్రంలోని ని పలు ప్రధాన వీధుల గుండా ద్విచక్ర వాహనాలతో ర్యాలీ నిర్వమించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ హెల్మె ట్ ధరించి వాహనాలు నడిపితే ప్రమాదాలు సంభవిస్తే ప్రాణాలకు రక్షణగా నిలుస్తుంద ని తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై విక్రమ్, నాయకులు ధనుంజయ్ తదితరులు పాల్గొన్నారు. పెంచికలపేట మండలకేంద్రంలోని పోలీసు స్టేషన్ నుంచి ప్రధాన వీధుల గుండా దివచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కాగజ్‌నగర్ రూరల్ సీఐ కుమారస్వామి మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని అన్నారు. ఈ ర్యాలీని కేజీబీవీ ఎస్‌వో కవిత జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాంచందర్, పోలీసులు, గ్రామస్తులు పాల్గొన్నారు. సిర్పూర్(టి) మండలంలో భద్రత మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం సీఐ సురేష్, ఎస్సై సురేష్‌కుమార్‌ల ఆధ్వర్యంలో ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు.

## ఇందిరమ్మ ఇండ్ల పరిశీలన..

**సారంగాపూర్, జనవరి 6 (ప్రభాత సమాచారం)**
సకాలంలో ఇండ్లు నిర్ణయించుకోవాలని స్వర్ణ గ్రామ సర్పంచ్ మల్లేష్, మార్కెట్ చైర్మన్ అబ్దుల్ హాది అన్నారు. మంగళవారం గ్రామాల్లోని మంజూరైన ఇందిరమ్మ ఇండ్లను ఉప సర్పంచ్ సాహెల్,గ్రామ కార్యదర్శి ప్రేమలత తో కలసి పరిశించారు. కొన్ని ఇండ్లు పూర్తికగా ఇండ్లు బేస్మెంట్ పూర్తి కాగా 5 ఇండ్లు పునాది తవ్వి పనులు చేపట్టారు. లబ్ధిదారుల ఖాతాల్లో డబ్బులు జమ అయ్యన్నారు. మిగతా వారు సకాలంలో ఇండ్లు నిర్మించుకోవాలన్నారు.






# నాగోబా జాతరకు మంత్రుల ఆహ్వానం

**ఇంద్రవెల్లి, జనవరి 6 (ప్రభాత సమాచారం)**

ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్ నాగోబా జాతర ఈనెల 18న ప్రారంభం కానుంది. జాతరకు లక్షలాది మంది భక్తులు హాజరుకానున్నారు. మంగళవారం ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు కేస్లాపూర్ నాగోబా దేవాలయం కమిటీ సభ్యులు, ఆలయ పీఠాధిపతి వెంకటరావుతో కలిసి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రులు సీతక్క జూపల్లి కృష్ణారావుతో పాటు సీఎం సలహాదారుడు వేం.నరేందర్ రెడ్డిలను కలిశారు. ఈనెల 18న నాగోబా ఆలయంలో మహా పూజ 22న దర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. నాగోబా జాతరకు హాజరు కావాలని ఆహ్వాన పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో కేస్లాపూర్ సర్పంచ్ మెస్రం తుకారాం, ఆలయ పూజారి మెస్రం షేకు, ఆలయ కమిటీ చైర్మన్ మెస్రం ఆనంద్ రావ్, ఆలయ ఈవో రవి కుమార్, మెస్రం వంశీయులు తదితరులు పాల్గొన్నారు.

# భక్తులకు ఇబ్బంది కలగకుండా బందోబస్తు

- ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, అదనపు ఎస్పీ కాజల్ సింగ్
- నాగోబా జాతర ఏర్పాట్ల పరిశీలన



**ఇంద్రవెల్లి, జనవరి 6 (ప్రభాత సమాచారం)**

మండలంలోని సుప్రసిద్ధ ఆదివాసీ జాతర నాగోబా జాతర ఈనెల 18వ తారీఖు నుండి ప్రారంభం అవుతున్న సందర్భంగా జిల్లా పోలీస్ యంత్రాంగం ప్రతిష్టమైన చర్యలను చేపడుతున్నట్లు అందులో భాగంగానే ఈరోజు ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్ గ్రామం నందు గల నాగోబా ఆలయం వద్ద ఏర్పాటు చేయనున్న బందోబస్తు చర్యలను జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ సమీక్షించారు. భక్త జనానికి ఎలాంటి ఇబ్బందులు లోటుపాట్లు లేకుండా చర్యలను చేపడుతున్నట్లు అన్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక సిబ్బందిని కేటాయిస్తున్నట్లు తెలిపారు. పార్కింగ్, రూట్, సీసీటీవీ_మెరాలు ఇలాంటి వాటిపై పూర్తిగా సమీక్షించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పి ఉట్నూర్ కాజల్ సింగ్ ఐపీఎస్, శిక్షణ ఐపిఎస్ రాహుల్ కాంత్, స్పెషల్ బ్రాంచ్ డిఎస్పి పోతారం శ్రీనివాస్, ఉట్నూరు సిఐ ప్రసాద్, ఎస్సై సాయన్న సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





# జనరేటర్ లేక అవస్థలు

**కౌటాల, జనవరి 6 (ప్రభాత సమాచారం)**

కౌటాల ప్రభుత్వ ఆసుపత్రిలో చీకట్లోనే చికిత్సలు చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. మండలంలోని తుమ్మిడిహెట్టి గ్రామానికి చెందిన లవకుష్ మంగళవారం తన చేనులో సాయంత్రం క్రషర్ పడుతున్న సమయంలో పాము కాటుకు గురయ్యాడు. వెంటనే కుటుంబ సభ్యులు స్పందించి లవకుష్‌ను కౌటాల మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకు వచ్చారు. డాక్టర్ పవన్‌కల్యాణ్ ఇంజక్ష న్ ఇచ్చి చికిత్సలు నిర్వహించారు. అదే సమయంలో చింతలమానేపల్లి మండలం గంగాపూర్‌కు చెందిన గర్భిణీ సునీత పురిటి నొప్పులతో బాధపడుతూ ఆసుపత్రికి రాగా వారికి సైతం డాక్టర్ చికిత్సలు కాన్పు చేయగా మగబిడ్డకు జన్మనిచ్చింది. ఇదే సమయంలో కరెంటు పోవడంతో ఇరువురికి సైతం డాక్టర్ సెల్‌ఫోన్ లైట్ల సహాయంతో చికిత్స అందించారు. కాసేపటి తరువాత కరెంటు రాగా లవకుష్‌ను మెరుగైన చికిత్స కోసం కాగజ్‌నగర్ రెఫర్ చేశారు. గర్భిణి సునితకు ఆసుపత్రిలోనే చికిత్సలు అందిస్తున్నారు. చీకట్లో కూడా డాక్టర్ స్పందించి చికిత్స అందించడం పట్ల ఆయనను అభినందిస్తున్నారు.

# 9న భైంసాకు కేంద్ర మంత్రి బండి సంజయ్

**ముథోల్, జనవరి 6 (ప్రభాత సమాచారం)**

9న ముధోల్ తాలూకా బీజేపీ సర్పంచులు, ఉప సర్పంచ్, వార్డు సభ్యుల సన్మాన సభకు కేంద్ర మంత్రి బండి సంజయ్ హాజరు కానున్నట్లు ఎమ్మెల్యే రామారావు పటేల్ పేర్కొన్నారు. ఈ సన్మాన కార్యక్రమానికి నూతనంగా ఎన్నికైన సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు మెంబర్లు పెద్ద సంఖ్యలో తరలి రావాలని ఎమ్మెల్యే రామరావ్ పటేల్ పిలుపునిచ్చారు. తాలూకాలో చరిత్రాత్మక విజయంతో రానున్న ఎన్నికల్లో మరింత దూసుకుపోవడానికి కమలదళం ముందుకెళ్తుందని, భైంసాలోని ఎస్ ఎస్. జిన్నింగ్ ఫ్యాక్టరీలో ఈ కార్యక్రమం జరగనుందని ఆయన పేర్కొన్నారు.

# బాసరలో కంటెయినర్ గదులు

**ముథోల్, జనవరి 6 (ప్రభాత సమాచారం)**

నిర్మల్ జిల్లాలో బాసర సరస్వతీ క్షేత్రానికి వచ్చే భక్తుల కోసం కంటెయినర్ గదులను ఏర్పాటుచేశారు. ఇందులో ఒక పడక గది, మరుగుదొడ్డితో పాటు ఏసీ సౌకర్యం ఉన్నాయి. ఇవి పర్యాటకులను, భక్తులను బాగా ఆకట్టుకుంటున్నాయి. రూ.70 లక్షల వరకు వెచ్చించి 12 అద్దె గదులు ఏర్పాటు చేసినట్టు నిర్వాహకులు చెబుతున్నారు.



# 'సింగరేణి' ఉద్యోగాలపై డిప్యూటీ సీఎం కీలక ప్రకటన

**మంచిర్యాల, జనవరి 6 (ప్రభాత సమాచారం)**



సింగరేణి కార్మికులు, వారి కుటుంబ సభ్యుల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సింగరేణి పరిధిలోని ప్రాంతీయ ఆసుపత్రుల్లో పెండింగ్‌లో ఉన్న వైద్యులు, పారామెడికల్ సిబ్బంది పోస్టులను రాబోయే 2026 మార్చి నాటికి పూర్తిగా భర్తీ చేస్తామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రకటించారు. మంగళవారం అసెంబ్లీలో సింగరేణిఅబశ్రీశ్రీపై జరిగిన చర్చ సందర్భంగా సభ్యులు రాజ్?ఠాకూర్, కూనంనేని సాంబశివ రావు, కవ్వంపల్లి సత్యనారాయణ అడిగిన ప్రశ్నకు సమాధానం ఇచ్చారు. ప్రస్తుతం 11 మంది కాంట్రాక్ట్ డాక్టర్లు పనిచేస్తున్నారని 32 మంది డాక్టర్ల కోసం నోటిఫికేషన్ ఇచ్చామని త్వరలోనే ఆ ఖాళీలను భర్తీ చేస్తామని చెప్పారు. 176 పారామెడికల్ సిబ్బంది అంతర్గత నియామకం ప్రక్రియ కొనసాగుతున్నదని వెల్లడించారు. రామగుండంలో క్యాత్ లాబ్ నిర్మాణం పీపీపీ మోడల్‌లో చేపడుతున్నామని కాంట్రాక్ట్ అవార్డు కూడా పూర్తయిందని 5 రోజుల్లో ప్రారంభిస్తామని ప్రకటించారు. ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులకు సింగరేణి ఆసుపత్రుల్లో మందుల సౌకర్యం కల్పిస్తున్నామని, సీపీఆర్ఎంఎస్ పథకం అందుబాటులో ఉన్నదని వెల్లడించారు. రిటైర్డ్ ఉద్యోగులు 8 లక్షల వరకు మందులను తీసుకునే అవకాశం కూడా కల్పించామని చెప్పారు. టెర్మినల్ బెనిఫిట్స్ కూడా అందిస్తున్నామని పేర్కొన్నారు. సింగరేణి పరిధిలోని ఖాళీ స్థలాల్లో ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులు ఇండ్ల నిర్మాణం కొరకు స్థల కేటాయింపు అంశాన్ని బోర్డులు మాట్లాడి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. తెలంగాణ రాష్ట్రంలో అతిపెద్ద పబ్లిక్ సెక్టార్ సింగరేణి సంస్థని వేల మంది యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించే ఈ సంస్థను కాపాడుకోవాల్సిన బాధ్యత ఉద్యోగులతో పాటు ప్రజాప్రతినిధులపై అందరిపై ఉందన్నారు.

విలేకరులు కావలెను
ప్రభాత సమాచారం
ఆదిలాబాద్ Digital Edition
మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్
తెలుగులో తప్పులు లేకుండా రాయగలిగి సామాజిక స్పృహతో స్పందించే ఉత్సహం, అవినీతి, అక్రమాలు వెలికితీసే ధైర్యం, ప్రశ్నించే తత్వం ప్రజా సమస్యలను వెలికితీసి పాత్రికేయ వృత్తిలో రాణించాలనే ఆసక్తి మీలో ఉందా.. ఆ అవకాశాన్ని ప్రభాత సమాచారం దినపత్రిక కల్పిస్తుంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, నిర్మల్, మంచిర్యాల జిల్లాలోని మండల కేంద్రాల్లో, నియోజకవర్గ, జిల్లా కేంద్రాల్లో విలేకరులుగా పనిచేసేందుకు ఆసక్తి ఉన్నవారు సంప్రదించండి.
ఆసక్తి ఉన్నవారు సంప్రదించండి
సయ్యద్ కరీం, ఎడిటర్ - ప్రభాత సమాచారం తెలుగు దినపత్రిక
9440977660, 9110718194
PRABHATHASAMACHARAM.COM
TELANGANA TELUGU DAILY